ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో

మీకు నిజం రాసే ధైర్యం ఉందా?

అందుకు

వార్త సంధ్య మీ వేదిక!

రండి — ప్రజల గళంగా, నిజం కోసం మాతో కలవండి.

ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి

vaarthasandhya@gmail.com



RNI TGTEL/25/A5065

vaartha sandhya

# వార్త సంధ్య

తెలుగు దిన పత్రిక

నిజం నిర్భయంగా మీ ముందుకు

Published From : Rangareddy | epaper.vaarthasandhya.com | VOLUME : 01 | Issue : 239 | Monday 17 - 08 - 2026 | Editor : Seggem Kiran Kumar | Pages : 08 | Price : 6/-




## చందానగర్‌లో

### శ్రీ వేంకటేశ్వర స్వామి పవిత్రోత్సవాలు

ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా

హైదరాబాద్, ఆగస్టు 16 (వార్త సంధ్య): చందానగర్‌లోని విశాఖ శ్రీ శారదా పీఠం ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలకు తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఆదివారం సాయంత్రం హాజరయ్యారు.

ఈ సందర్భంగా గవర్నర్ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఆయనకు ఆలయ సంప్రదాయాల ప్రకారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

అనంతరం గవర్నర్ శారదా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి వారిని, ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి వారిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పీఠాధిపతుల ఆశీస్సులు అందుకున్నారు.

పవిత్రోత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

# పరకాల సభలో సీఎం రేవంత్ రెడ్డి హాట్ కామెంట్స్..!

కేసీఆర్ ప్రభుత్వంలో కుటుంబానికి అధికారం.. ప్రజా ప్రభుత్వంలో ప్రజలకే అధికారం

రైతులు, మహిళలు, నిరుద్యోగుల కోసమే మా ప్రభుత్వం.. 2029లో రెట్టింపు

**పరకాల, ఆగస్టు 16 (వార్త సంధ్య)**: వరంగల్ జిల్లాకు గొప్ప చరిత్ర, చైతన్యం ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. పాలకుల అణచివేతకు గురైన ప్రతిసారీ ఈ గడ్డ తన పోరాట పటిమను చాటుకుందని పేర్కొన్నారు. పరకాలలో నిర్వహించిన 'ప్రజా పాలన ప్రగతి బాట' బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. తమకు ఎదురు లేదనుకున్న వారిని మట్టికరిపించిన చరిత్ర వరంగల్ గడ్డకు ఉందన్నారు.

పాలకుర్తిలో కాంగ్రెస్ అభ్యర్థి యశస్విని రాజకీయ కొండను బద్దలు కొట్టారని వ్యాఖ్యానించారు. ఇచ్చిన మాట తప్పకుండా నెరవేర్చాలనే సంకల్పంతో రోజుకు 18 గంటలు



పనిచేస్తున్నామని తెలిపారు.

**రైతులకు రూ.లక్ష కోట్ల ఖర్చు**

కాళేశ్వరం పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ రాష్ట్రంలోని ప్రాజెక్టులను నింపి రైతులు అత్యధిక పంటలు పండించేలా చర్యలు తీసుకున్నామని సీఎం తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 32 నెలల్లో ధాన్యం కొనుగోలు చేసి రైతులకు రూ.90 వేల కోట్లు చెల్లించామని చెప్పారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ ద్వారా రైతును రాజును చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రెండున్నరేళ్లలో రైతుల కోసం రూ.లక్ష కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. సన్నధాన్యం పండించిన రైతులకు బోనస్ అందించిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

**మహిళలకు ఆర్థిక భరోసా**

తమ ప్రభుత్వంలో ఇద్దరు మహిళలను మంత్రులుగా చేశామని రేవంత్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం సున్నా వడ్డీ రుణాలకు గుండు సున్నా పెట్టిందని విమర్శించారు. తమ ప్రభుత్వం మహిళలకు సున్నా వడ్డీ రుణాలు అందిస్తోందన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యూనిఫాం కుట్టే పనులను మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించామని, సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు నిర్వహించేలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.

**కేసీఆర్ కుటుంబ రాజకీయాలపై విమర్శలు**

కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న స మ య ం లో ఆ య న

మిగతాది 2 పేజీలో...

## రేవంత్ రెడ్డి అబద్ధాలు.. ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం

## ప్రజాధనంతో సభలు పెట్టి కేసీఆర్, హరీశ్‌రావుపై విమర్శలా? తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్



హైదరాబాద్, ఆగస్టు 16 (వార్త సంధ్య): సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున కూడా సీఎం అబద్ధాలు మాట్లాడారని ఆరోపించారు. ప్రజాధనంతో సభలు నిర్వహించి మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులను విమర్శించడం సరికాదన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.

కేసీఆర్ అపర భగీరథుడిలా ఇంటింటికీ తాగునీరు అందించారని సునీత లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డికి ఎలాంటి విధానం లేదని, బూతులు

## మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన తెలంగాణను బీఆర్ఎస్ అప్పుల రాష్ట్రంగా మార్చింది: మంత్రి పొంగులేటి

పదేళ్ల పాలనలో 8 లక్షల కోట్లు అప్పు చేసినా.. 80 వేల ఇళ్లు కూడా నిర్మించలేదు

కాంగ్రెస్ రెండేళ్లలో 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు.. 2 లక్షల ఇళ్లకు గృహప్రవేశాలు

పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం: పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**పరకాల, ఆగస్టు 16 (వార్త సంధ్య)** మిగులు బడ్జెట్‌తో ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణను పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో భారీగా అప్పులపాలు చేశారని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. రూ.8 లక్షల కోట్ల వరకు అప్పులు చేసినప్పటికీ పేదలకు కనీసం 80 వేల ఇళ్లను కూడా నిర్మించి ఇవ్వలేకపోయారని ఆరోపించారు. పరకాలలో నిర్వహించిన 'ప్రజాపాలన—ప్రగతి బాట' కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు పెద్ద ఎత్తున చర్యలు చేపట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు విడతల్లో రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఇప్పటికే సుమారు 2 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తై

మిగతాది 2వ పేజీలో

# మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం అండ: మంత్రి కోమటిరెడ్డి

వృత్తి, వ్యాపారాలతో మహిళలు ఆర్థికంగా ఎదగాలి

నల్గొండలో రూ.3.50 కోట్లతో 'నీలగిరి మహిళా శక్తి' పెట్రోల్ పంపు ప్రారంభం



**నల్గొండ, ఆగస్టు 16 (వార్త సంధ్య):** మహిళలు వృత్తి, వ్యాపారాల ద్వారా ఆర్థిక సాధికారత సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. శనివారం నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని గంధంవారిగూడెంలో నీలగిరి జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో రూ.3.50 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన నీలగిరి మహిళా శక్తి పెట్రోల్ పంపును మంత్రి ప్రారంభించారు. అనంతరం సూపర్ మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

**మహిళలకు అనేక అవకాశాలు:** ఈ సందర్భంగా స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ మహిళలకు వడ్డీలేని రుణాలతో పాటు బ్యాంకు లింకేజీ రుణాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, బస్సుల నిర్వహణ, సోలార్ యూనిట్ల ఏర్పాటు, ఇన్సూరెన్స్ వంటి పలు కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.

మహిళలు చిన్న వ్యాపారాలతో పాటు రైస్ మిల్లులు, గోదాములు, ప్రాసెసింగ్ యూనిట్లు, పెట్రోల్ పంపులు నిర్వహిస్తూ ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మహిళలను పెద్ద ఎత్తున ఆర్థికంగా ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

నల్గొండలో ఏర్పాటు చేసిన నీలగిరి మహిళా శక్తి పెట్రోల్ పంపును రాష్ట్రంలోనే ప్రత్యేకంగా తీర్చిదిద్దామని మంత్రి చెప్పారు. పెట్రోల్ పంపు పక్కనే సూపర్ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నామని, భవిష్యత్‌లో కాఫీ షాప్, రెస్టారెంట్ వంటి వ్యాపారాలను కూడా నిర్వహించుకోవచ్చన్నారు.

**విద్యా సంస్థలతో మహిళలకు వ్యాపార అవకాశాలు**

పెట్రోల్ పంపు సమీపంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, రూ.40 కోట్లతో నర్సింగ్ కళాశాల, మెడికల్ కళాశాలలు ఏర్పాటు కానున్నాయని మంత్రి తెలిపారు. వేలాది మంది విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసించనున్న నేపథ్యంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలోని సూపర్ మార్కెట్, పెట్రోల్ పంపులు తెలంగాణలోనే నంబర్ వన్‌గా నిలిచేలా చూడాలనే ఉద్దేశంతో ఈ అవకాశం కల్పించామని చెప్పారు.

రూ.20 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు పేదలందరికీ నాణ్యమైన విద్య అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేల కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్

మిగతాది 2 పేజీలో...

## కల్యాణలక్ష్మి—షాదీ ముబారక్ రద్దు కుట్రను అడ్డుకోవాలి: కేటీఆర్

హైకోర్టు తీర్పును సాకుగా చూపుతూ పేదింటి ఆడబిడ్డల భరోసాను ఎత్తివేసే ప్రయత్నం

కల్యాణలక్ష్మి అంశంలో ప్రభుత్వం కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదు?

తులం బంగారం హామీపై ప్రశ్నలు వస్తుండటంతోనే పథకాన్ని రద్దు చేసే కుట్ర

నేడు రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ, మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ నిరసనలు



**హైదరాబాద్, ఆగస్టు 16 (వార్త సంధ్య):** పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ఆర్థిక భరోసాకు ప్రతీకగా నిలిచిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పూర్తిగా రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. హైకోర్టు తీర్పును సాకుగా చూపుతూ లక్షలాది పేద కుటుంబాలకు అండగా నిలిచిన పథకాలను ఎత్తివేసే ప్రయత్నం జరుగుతోందని ఆయన మండిపడ్డారు. ఈ కుట్రను అడ్డుకోవడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రేపు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గ, మండల

మిగతాది పేజీ 3లో...

# సంపాదకీయం

## ఐక్యతే భారత బలం

భారతదేశం అనేక భాషలు, మతాలు, సంస్కృతులు, సంప్రదాయాలకు నిలయమైన దేశం. ఈ భిన్నత్వంలో ఏకత్వమే మన దేశానికి అసలైన బలం. అభిప్రాయాలు, రాజకీయ సిద్ధాంతాలు వేరైనా దేశ ప్రయోజనం విషయంలో ప్రతి భారతీయుడు ఒక్కతాటిపై నిలవాలి. పరస్పర గౌరవం, సహనం, సౌభ్రాతృత్వం ప్రజాస్వామ్యానికి పునాదులు. విభజన భావాలను అధిగమించి సమష్టి ప్రయోజనాల కోసం పనిచేసినప్పుడే దేశం మరింత అభివృద్ధి చెందుతుంది. యువతలో జాతీయ భావాన్ని పెంపొందించడం, సామాజిక బాధ్యతను గుర్తుచేయడం ప్రతి ఒక్కరి కర్తవ్యం.

కులం, మతం, ప్రాంతం వంటి భేదాలకు అతీతంగా భారతీయులంతా దేశ సమగ్రతను కాపాడాలి. సంక్షోభ సమయాల్లో మన ఐక్యత ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలి. అభివృద్ధి ఫలాలు ప్రతి పౌరుడికి అందాలంటే కేంద్రం, రాష్ట్రాలు, ప్రజలు పరస్పర సహకారంతో ముందుకు సాగాలి. ఐక్యంగా ఉన్నప్పుడే బలమైన, సమర్థవంతమైన, ప్రపంచంలో గౌరవం పొందే భారతదేశాన్ని నిర్మించగలం. అందుకే దేశ ఐక్యతను కాపాడటం కేవలం ప్రభుత్వాల బాధ్యత కాదు; ప్రతి పౌరుడి పవిత్ర బాధ్యత.

## వాట్సాప్ జాబ్ మెసేజ్‌తో వల..
# రూ. 96 లక్షలు గల్లంతు



**హైదరాబాద్, ఆగస్టు 16:** నగరంలో సైబర్ నేరగాళ్లు వృద్ధులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. జూబ్లీహిల్స్‌కు చెందిన 75 ఏళ్ల రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి సైబర్ మోసగాళ్ల వలలో చిక్కుకుని ఏకంగా రూ.96 లక్షలు కోల్పోయిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. పార్ట్‌టైమ్ ఉద్యోగం పేరుతో వాట్సాప్‌లో పరిచయం చేసుకున్న నిందితులు, అనంతరం ఫారెక్స్ ట్రేడింగ్ పేరుతో బాధితుడిని మోసం చేశారు.

**చిన్న మొత్తాల చెల్లింపులతో నమ్మకం** మొదట సైబర్ నేరగాళ్లు బాధితుడికి వాట్సాప్ ద్వారా పార్ట్‌టైమ్ ఉద్యోగం ఆఫర్ చేశారు. కొన్ని చిన్న పనులు అప్పగించి, వాటికి డబ్బులు చెల్లించారు. దీంతో బాధితుడికి వారిపై నమ్మకం ఏర్పడేలా చేశారు. అనంతరం అతడిని టెలిగ్రామ్ గ్రూప్‌లోకి చేర్చి విదేశీ మారక ద్రవ్య (ఫారెక్స్) ట్రేడింగ్‌లో భారీ లాభాలు వస్తాయని నమ్మించారు.

**స్క్రీన్‌పై నకిలీ లాభాలు** బాధితుడికి నకిలీ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌ను చూపించి, అందులో పెట్టుబడులపై భారీ లాభాలు వచ్చినట్లు ప్రదర్శించారు. ఆ లాభాలను చూసిన బాధితుడు మరింత డబ్బు పెట్టుబడి పెట్టినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం డబ్బును విత్‌డ్రా చేసుకోవాలంటే ప్రాసెసింగ్ ఫీజులు, ఇతర ఛార్జీలు చెల్లించాలంటూ నిందితులు డిమాండ్ చేశారు. ఇలా విడతల వారీగా బాధితుడి నుంచి సుమారు రూ.96 లక్షలు బదిలీ చేయించుకున్నట్లు పోలీసులు తెలిపారు.

**సీనియర్ సిటిజన్లే టార్గెట్** హైదరాబాద్‌లో వృద్ధులు సైబర్ నేరగాళ్లకు ప్రధాన లక్ష్యంగా మారుతున్నారని పోలీసుల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. జనవరి 2025 నుంచి జూలై 2026 వరకు 60 ఏళ్లు పైబడిన వారిపై నమోదైన 403 సైబర్ నేర కేసుల్లో మొత్తం రూ.102.02 కోట్ల నష్టం జరిగినట్లు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు వెల్లడించారు. వీటిలో ట్రేడింగ్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ పేరుతో చేసే మోసాలు ప్రధానంగా ఉన్నాయి.

**ట్రేడింగ్ మోసాలపై అప్రమత్తత అవసరం** అధిక లాభాలు వస్తాయంటూ వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారా వచ్చే పెట్టుబడి, ఉద్యోగ ఆఫర్లను నమ్మవద్దని పోలీసులు సూచిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపే యాప్స్, వెబ్‌సైట్లలో డబ్బులు పెట్టుబడి పెట్టకూడదని హెచ్చరిస్తున్నారు. అలాగే పోలీసులు, ప్రభుత్వ అధికారులు ఫోన్ లేదా వీడియో కాల్ ద్వారా బెదిరించి డబ్బులు డిమాండ్ చేయరని స్పష్టం చేస్తున్నారు.

(మొదటి పేజీ తరువాయి..)

కుమారుడు కేటీఆర్, అల్లుడు హరీశ్‌రావును మంత్రులుగా చేశారని రేవంత్ రెడ్డి విమర్శించారు. తాను ముఖ్యమంత్రి అయిన తర్వాత సీతక్క, కొండా సురేఖలను మంత్రులుగా చేశానన్నారు. కేసీఆర్ హయాంలో ఎర్రబెల్లి దయాకర్ రావుకు మంత్రి పదవి ఇస్తే.. తాను ముఖ్యమంత్రి అయిన తర్వాత అడ్లూరి లక్ష్మణ్‌కు మంత్రి పదవి ఇచ్చానని తెలిపారు. కేసీఆర్ తన కుమార్తెను ఎంపీగా చేసి, ఓడిపోయిన తర్వాత ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని విమర్శించారు. తాను కావ్యను ఎంపీగా, యశస్వినిని ఎమ్మెల్యేగా చేశానన్నారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు, బంధువులకు పదవులు ఇచ్చుకున్నారని ఆరోపించిన రేవంత్ రెడ్డి.. తాను మిత్రధర్మంతో వేం నరేందర్‌రెడ్డికి రాజ్యసభ అవకాశం కల్పించానని, ఉద్యమకారుడు కోదండరాంకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చానని చెప్పారు.



**72 వేల ఉద్యోగాల భర్తీ**

గత ప్రభుత్వం పదేళ్ల పాటు ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగులను ఇబ్బందులకు గురిచేసిందని సీఎం ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం ఇప్పటివరకు 72 వేల ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలను పూర్తి చేసిందని తెలిపారు. పోలీస్ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామని, నిరుద్యోగుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని వయోపరిమితిలో సడలింపులు కల్పించామని చెప్పారు. ప్రతి ఆరు నెలలకు ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను గుర్తించి భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. "ఉద్యోగాలు భర్తీ చేసే బాధ్యత మాది.. పరీక్షలకు సిద్ధం కావాల్సిన బాధ్యత మీది" అని సీఎం స్పష్టం చేశారు.

**సెప్టెంబరులో అసెంబ్లీ సమావేశాలు**

రైతులు, మహిళలు, నిరుద్యోగుల కోసమే తమ ప్రభుత్వం పనిచేస్తోందని రేవంత్ రెడ్డి అన్నారు. సెప్టెంబరులో శాసనసభ సమావేశాలు నిర్వహిస్తామని వెల్లడించారు. తమది సామాన్యుల కోసం పనిచేసే ప్రభుత్వమని, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎంతైనా కష్టపడతానని హామీ ఇచ్చారు.

**2029లో రెట్టింపు మెజారిటీతో గెలిపించండి**

2029 ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రెట్టింపు మెజారిటీతో గెలిపించాలని సీఎం ప్రజలను కోరారు. "మీ కోసం ఎంతైనా కష్టపడతా.. మీ సమస్యలను పరిష్కరిస్తా. మీ ఆశీర్వాదం ఉన్నంతకాలం వెయ్యి మంది కేసీఆర్‌లు వచ్చినా వెంట్రుక కూడా పీకలేరు" అంటూ రేవంత్ రెడ్డి సభలో ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ కుటుంబానికి లాభం చేకూర్చే పాలనకు, ప్రజలకు లాభం చేకూర్చే ప్రజా పాలనకు మధ్య తేడాను ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

(మొదటి పేజీ తరువాయి..)

రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తోందని వెంకట్‌రెడ్డి తెలిపారు. పబ్లిక్ పాఠశాలలను కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నీలగిరి మహిళా శక్తి పెట్రోల్ పంపు, సూపర్ మార్కెట్ పక్కనే విద్యాసంస్థలు ఏర్పాటు కావడం సంతోషకరమన్నారు. డిసెంబర్ 9న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

**మహిళా సంఘాలకు రూ.1,142 కోట్ల బ్యాంకు రుణాలు**

మహిళల ఆర్థిక అభివృద్ధిలో భాగంగా నల్గొండ జిల్లాలో మహిళా సంఘాలకు రూ.1,142 కోట్ల బ్యాంకు రుణాలు అందించామని మంత్రి తెలిపారు. మహిళలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా కల్పిస్తున్నామన్నారు. కొత్తగా సంఘాలు ఏర్పాటు చేసుకుని వృత్తులు, వ్యాపారాలు నిర్వహిస్తూ ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సూచించారు.

**రైతులు, మహిళలు, విద్యార్థుల జీవితాల్లో వెలుగులు**

నింపడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

**2028 నాటికి ఎస్ఎల్బీసీ పనులు పూర్తి**

2028 నాటికి ఎస్ఎల్బీసీ సొరంగం పనులను పూర్తి చేసి నల్గొండ జిల్లాను సస్యశ్యామలం చేస్తామని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఏఎంఆర్‌పీ లైనింగ్ పనులు చేపట్టామని చెప్పారు.

నల్గొండ నియోజకవర్గంలోని మూడు మండలాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో రైస్ మిల్లుల ఏర్పాటుకు ఇప్పటికే చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఒక్కొక్కటి 5 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాములు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు.

నీలగిరి మహిళా శక్తి పెట్రోల్ పంపును స్వయం సహాయక మహిళా సంఘాలు సమర్థవంతంగా నిర్వహించాలని మంత్రి సూచించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ద్వారా ఏర్పాటు చేసిన పెట్రోల్ పంపులో నిబంధనలు తప్పకుండా పాటిస్తూ విక్రయాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.




**మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం** నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ నల్గొండలో ఏర్పాటు చేసిన నీలగిరి మహిళా శక్తి పెట్రోల్ పంపు రాష్ట్రంలో మూడోది అని తెలిపారు. పక్కనే రూ.2 కోట్ల వ్యయంతో సూపర్ మార్కెట్ నిర్మిస్తున్నామని చెప్పారు.

గత ప్రభుత్వం మహిళా సంఘాలను నిర్వీర్యం చేసిందని ఆరోపించిన ఆయన.. మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న లక్ష్యంతో తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో దశలవారీగా ఇలాంటి పెట్రోల్ పంపులతో పాటు ఇతర వ్యాపారాలకు కూడా మహిళా సంఘాలకు సహాయం అందిస్తామని తెలిపారు.

**మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి** జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి, కుటుంబ సాధికారత కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రూ.3.50 కోట్లతో ఏర్పాటు చేసిన నీలగిరి మహిళా శక్తి పెట్రోల్ పంపు భవిష్యత్‌లో మంచి లాభాలు ఆర్జించే అవకాశం ఉందని, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ముందుకు రావాలని సూచించారు.

నల్గొండ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పెట్రోల్ పంపు నిర్వహణతో మహిళలు మరో అడుగు ముందుకు వేశారని అన్నారు. మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంలో భాగంగానే ఇలాంటి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ డీజీఎం, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ,

## మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన తెలంగాణను బీఆర్ఎస్ అప్పుల రాష్ట్రంగా మార్చింది: మంత్రి పొంగులేటి

(మొదటి పేజీ తరువాయి..)

గృహప్రవేశాలు కూడా జరిగాయని వెల్లడించారు. పేదలకు ఇల్లు కేవలం ఒక భవనం కాదని, అది వారి ఆత్మగౌరవానికి చిహ్నమని మంత్రి పేర్కొన్నారు. అందుకే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో వేగంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. పేదల సొంతింటి కల సాకారం ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రజాపాలన కొనసాగిస్తున్నామని పొంగులేటి తెలిపారు. ఇళ్ల నిర్మాణంతో పాటు మౌలిక వసతులు, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను సమన్వయంతో అమలు చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పేదల ఇళ్ల విషయంలో చేసిన ప్రకటనలకు, వాస్తవంగా నిర్మించిన ఇళ్లకు మధ్య భారీ వ్యత్యాసం ఉందని మంత్రి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు సాగుతోందన్నారు. "పేదవారి ఆత్మగౌరవ చిహ్నంగా ఇందిరమ్మ ఇళ్లను భావిస్తున్నాం. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం. అందుకే ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి పేదలకు అందిస్తున్నాం" అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ప్రజాపాలన లక్ష్యం రాష్ట్రంలో ప్రజాపాలన ద్వారా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రభుత్వ పథకాలను నేరుగా అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడమే 'ప్రజాపాలన—ప్రగతి బాట' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని మంత్రి వివరించారు. పేదల సంక్షేమం, రైతుల అభివృద్ధి, మహిళల ఆర్థిక సాధికారతతో పాటు విద్య, వైద్యం, గృహ నిర్మాణ రంగాల్లో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

మాట్లాడటం తప్ప రాష్ట్రానికి ఉపయోగపడే పని ఒక్కటి కూడా చేయడం లేదని విమర్శించారు.

రేషన్ కార్డులపై గొప్పలు ఎందుకు? రేషన్ కార్డుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని ఆమె విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో 6.47 లక్షల రేషన్ కార్డులు ఇచ్చినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శాసన మండలిలోనే చెప్పారని గుర్తుచేశారు. రేషన్ కార్డులపై ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. tసన్న బియ్యం పంపిణీ తమ ప్రభుత్వ ఘనత కాదని, సన్న బియ్యానికి బ్రాండ్ అంబాసిడర్ కేసీఆరేనని అన్నారు. సన్న బియ్యం పంపిణీని ప్రారంభించింది కూడా కేసీఆరేనని పేర్కొన్నారు.

రైతులకు అన్యాయం

వ్యవసాయానికి 12 గంటల కరెంటు కూడా అందడం లేదని అధికారులే చెబుతున్నారని సునీత లక్ష్మారెడ్డి అన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ వ్యవసాయాన్ని పండుగ చేశామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. రైతు రుణమాఫీని హామీ ఇచ్చిన విధంగా అమలు చేయలేదని ఆరోపించారు. కేసీఆర్ రెండేళ్లలో ఇచ్చిన రైతుబంధు కంటే రేవంత్ ప్రభుత్వం అందించిన రైతు భరోసా నిధులే తక్కువని అన్నారు. బోనస్‌ను బోగస్‌గా మార్చి ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని విమర్శించారు. యూరియా యాప్ తీసుకొచ్చి రైతుల కష్టాలను మరింత పెంచారని ఆరోపించారు. నిరుద్యోగులను మోసం చేశారు నిరుద్యోగ యువతను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని సునీత లక్ష్మారెడ్డి ఆరోపించారు. రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని, నిరుద్యోగ భృతి ఎక్కడుందని ప్రశ్నించారు. రాజీవ్ యువవికాసం పథకం పరిస్థితి ఏమిటని నిలదీశారు. తమ హక్కుల కోసం నిరుద్యోగులు ప్రశ్నిస్తే వారిని నిర్బంధిస్తున్నారని ఆరోపించారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సీఎం మాట తప్పారని విమర్శించారు. సిగాచి పరిశ్రమలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున ఇస్తామని చెప్పి ఆ హామీని కూడా నిలబెట్టుకోలేదన్నారు.

క్షుద్ర పూజల వ్యాఖ్యలపై ఆగ్రహం మాజీ మంత్రి హరీశ్‌రావుపై సీఎం రేవంత్‌రెడ్డి క్షుద్ర పూజల ఆరోపణలు చేయడాన్ని సునీత లక్ష్మారెడ్డి తప్పుబట్టారు. ఆధునిక యుగంలో ముఖ్యమంత్రి హోదాలో ఉండి రాతియుగం నాటి మాటలు మాట్లాడటం ఏమిటని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి క్షుద్ర పూజలు చేస్తేనే ముఖ్యమంత్రి అయ్యారా? అని ప్రశ్నిస్తూ.. సీఎం హోదాలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడంపై ప్రజలు చర్చించుకుంటున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డి ఇలాగే మాట్లాడితే మెదక్ జిల్లాలో కాంగ్రెస్‌కు వచ్చిన మూడు సీట్లు కూడా వచ్చే పరిస్థితి ఉండదని వ్యాఖ్యానించారు. మిషన్ భగీరథను నిర్వీర్యం చేశారు మిషన్ భగీరథను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని సునీత లక్ష్మారెడ్డి ఆరోపించారు. చెప్పిన హామీల్లో ఏవీ సీఎం పూర్తిగా అమలు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే లేకపోతే నిధులు ఇవ్వనన్నట్టుగా సీఎం వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

ఇందిరమ్మ ఇళ్లకు బకాయిలు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే ప్రభుత్వ పాలనను తప్పుబడుతున్నారని, ముందుగా వారికి సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 'డైవర్షన్ రాజకీయాలతో గెలుపును అడ్డుకోలేరు' రేవంత్‌రెడ్డి ఎన్ని డైవర్షన్ రాజకీయాలు చేసినా వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయాన్ని అడ్డుకోలేరని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం లా వ్యవహరిస్తున్నారా? లేక మంత్రగాడిలా మాట్లాడుతున్నారా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌ను పశుపతిలా ఫామ్‌హౌస్‌లో బంధించానని గతంలో రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను గుర్తుచేశారు. ఏ క్షుద్ర విద్యతో కేసీఆర్‌ను బంధించారో చెప్పాలని డిమాండ్ చేశారు.

పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో రేవంత్‌రెడ్డి కూడా హరీశ్‌రావు తిరిగిన గుడులనే తిరిగారని అన్నారు. కామాఖ్య ఆలయానికి ఎందుకు వెళ్లారో ప్రజలకు తెలుసని వ్యాఖ్యానించారు. ప్రజలకు రేవంత్ రంగులన్నీ తెలుసు ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని గుర్తించిన రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుని అనవసర ఆరోపణలు చేస్తున్నారని క్రాంతి కిరణ్ ఆరోపించారు. రాష్ట్రంలో కరువును ఎలా ఎదుర్కోవాలో ఆలోచించకుండా క్షుద్ర పూజలంటూ కల్లిబొల్లి మాటలు చెబుతున్నారని విమర్శించారు. సంగమేశ్వర–బసవేశ్వర ప్రాజెక్టుపై సంగారెడ్డి సభలో ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. నిత్యం ప్రజల్లో ఉండే హరీశ్‌రావును తప్పుడు ఆరోపణలతో దెబ్బతీయాలని రేవంత్‌రెడ్డి చూస్తున్నారని, అది ఎన్నటికీ సాధ్యం కాదన్నారు. 'ఇది ఏఐ యుగం.. రాతియుగం కాదు' t

ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇది ఏఐ యుగమన్న విషయాన్ని మరిచిపోయి రాష్ట్రాన్ని రాతియుగం వైపు తీసుకెళ్లేలా క్షుద్ర పూజలంటూ మాట్లాడుతున్నారని విమర్శించారు.ప్రజలు అన్నీ అర్థం చేసుకునే కాలమిదని, రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు జోకర్ మాటల్లా ఉన్నాయని అన్నారు. హరీశ్‌రావు ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తుంటే సీఎం ఓర్వలేకపోతున్నారని ఆరోపించారు.

హామీలు నెరవేర్చలేదు జహీరాబాద్‌కు గతంలో ఎన్నో హామీలు ఇచ్చి మాట తప్పిన వ్యక్తి రేవంత్‌రెడ్డి అని మాణిక్‌రావు విమర్శించారు. ఆయన మాటలను ప్రజలు విశ్వసించడం లేదన్నారు.

మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి గురించి మాట్లాడుతూ.. ఆయనను అందరి ముందు అవమానించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్‌లో టికెట్లు రాహుల్‌గాంధీ ఇస్తారని రేవంత్‌రెడ్డి చెబుతున్నారని, మరి ఏఐసీసీ అధ్యక్షుడిగా మల్లికార్జున్ ఖర్గే ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. సంగారెడ్డిలో సీఎం పర్యటనపై చింతా ప్రభాకర్ ఆగ్రహం బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి చీడపీడలాంటివారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సంగారెడ్డి సభ కాంగ్రెస్ పార్టీ సభలా జరిగిందని, సంగారెడ్డి ఎమ్మెల్యేగా తనకు కనీస సమాచారం కూడా ఇవ్వలేదన్నారు. తనను మాత్రమే కాకుండా సంగారెడ్డి ప్రజలను కూడా సీఎం అవమానించారని ఆరోపించారు. సంగారెడ్డి గడ్డపై అడుగుపెట్టే హక్కు రేవంత్‌రెడ్డికి లేదని వ్యాఖ్యానించారు. సంగారెడ్డిలో సీఎం బజారు భాష మాట్లాడారని విమర్శించారు.

సీఎం పర్యటన సందర్భంగా ముందస్తు అరెస్టులు చేశారని ఆరోపించిన చింతా ప్రభాకర్.. ముఖ్యమంత్రి పదవిలో ఉండి మూఢనమ్మకాల గురించి మాట్లాడటం సరికాదన్నారు. సంగారెడ్డిలో ఓడిపోయిన ఎమ్మెల్యేను పక్కన పెట్టుకుని ఎన్నికల ప్రచారంలా సీఎం వ్యవహరించారని విమర్శించారు.

జగ్గారెడ్డి అంత గొప్పవారైతే సంగారెడ్డి ప్రజలు ఎందుకు ఓడించారని ప్రశ్నించారు. సంగారెడ్డిలో జగ్గారెడ్డి భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని రోజులు ఉంటుందో తెలియదని వ్యాఖ్యానించారు.

స్మార్ట్ కార్డులపై సీఎం, మంత్రుల ఫొటోలు ఎందుకు పెట్టారని చింతా ప్రభాకర్ ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లడం వల్లే బీఆర్ఎస్ నేతలను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారని నాయకులు పేర్కొన్నారు.

(మొదటి పేజీ తరువాయి..)

# కల్యాణలక్ష్మి–షాదీ ముబారక్ రద్దు కుట్రను అడ్డుకోవాలి: కేటీఆర్

కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర జనరల్ బాడీ సభ్యులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో కేటీఆర్ ఈ మేరకు దిశానిర్దేశం చేశారు.

పేదింటి ఆడబిడ్డలకు కేసీఆర్ భరోసా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు కేవలం సంక్షేమ కార్యక్రమాలు మాత్రమే కాదని, తెలంగాణలోని పేద కుటుంబాల ఆడబిడ్డల ఆత్మగౌరవం, భవిష్యత్తుతో ముడిపడిన పథకాలని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం పేద కుటుంబాల్లో ఆడబిడ్డ వివాహం ఎంతటి ఆర్థిక భారంగా మారుతుందో గుర్తించిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ 2014 అక్టోబర్ 2న ఈ పథకాలను ప్రారంభించారని గుర్తుచేశారు.

తొలుత రూ.51 వేల ఆర్థిక సహాయంతో ప్రారంభించిన పథకాన్ని దశలవారీగా రూ.75,116కు, అనంతరం రూ.1,00,116కు పెంచారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సుమారు 13 లక్షల మంది ఆడబిడ్డల కుటుంబాలకు రూ.13 వేల కోట్ల మేర ఆర్థిక సహాయం అందించినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. కోవిడ్ వంటి తీవ్రమైన ఆర్థిక సంక్షోభ సమయంలో కూడా కల్యాణలక్ష్మి ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలిచామని తెలిపారు.

### తులం బంగారం హామీ ఏమైంది?

ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మితో పాటు ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాన్ని మరింత బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, ఇప్పుడు దానినే రద్దు చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. "కల్యాణలక్ష్మి కోసం ఎదురుచూస్తున్న ఆడబిడ్డలు



ఎన్నికల హామీ ప్రకారం తులం బంగారం కూడా అడుగుతున్నారు. ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే పథకాన్ని పూర్తిగా ఎత్తివేసే కుట్ర చేస్తున్నారు" అని కేటీఆర్ ఆరోపించారు.

### పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కల్యాణలక్ష్మి లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ అన్నారు. పెళ్లిళ్లు జరిగి నెలలు, సంవత్సరాలు గడిచినా కొందరికి ఆర్థిక సహాయం అందలేదని ఆరోపించారు. కొంతమంది లబ్ధిదారులకు పెళ్లయి, పిల్లలు పుట్టిన తర్వాత కూడా కల్యాణలక్ష్మి కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న అర్హులైన దరఖాస్తులన్నింటినీ వెంటనే పరిష్కరించి, లబ్ధిదారులకు ఆర్థిక సహాయం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### హైకోర్టులో కౌంటర్ ఎందుకు వేయలేదు?

కల్యాణలక్ష్మి అంశం హైకోర్టు పరిధిలో ఉన్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "హైకోర్టు నాలుగుసార్లు గడువు ఇచ్చినా ప్రభుత్వం కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదు? పేదింటి ఆడబిడ్డల ప్రయోజనాలకు సంబంధించిన కీలకమైన పథకాన్ని కాపాడుకునేందుకు ప్రభుత్వం సరైన వాదనలు ఎందుకు వినిపించలేదు?" అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి, మంత్రులకు సంబంధించిన వివిధ కేసుల్లో ప్రైవేటు న్యాయవాదులకు భారీ మొత్తాలు చెల్లించి న్యాయపరమైన పోరాటం చేస్తున్న ప్రభుత్వం, పేద ఆడబిడ్డలకు సంబంధించిన కల్యాణలక్ష్మి పథకాన్ని కాపాడేందుకు మాత్రం ఎందుకు కౌంటర్ దాఖలు చేయలేదని కేటీఆర్ నిలదీశారు.

### హైకోర్టు తీర్పును సాకుగా చేసుకుంటున్నారు

హైకోర్టు తీర్పును ఇప్పుడు సాకుగా చూపుతూ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పూర్తిగా నిలిపివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. కేసీఆర్ హయాంలో అమలైన పలు సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, ఇప్పుడు పేదింటి ఆడబిడ్డలకు భరోసాగా ఉన్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లపై కూడా కన్నేసిందని విమర్శించారు. "ఆడబిడ్డ భారం కాదు.. భరోసా" అనే ఆలోచనకు కేసీఆర్ ప్రభుత్వం రూపకల్పన చేసిందని కేటీఆర్ అన్నారు. ఈ పథకాలను రద్దు చేస్తే తెలంగాణ ఆడబిడ్డలు, వారి కుటుంబాలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తాయని హెచ్చరించారు.

### రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నిరసనలు

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ రేపు రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు.

### ప్రతి గ్రామంలో కాంగ్రెస్‌ను నిలదీయాలి

ప్రతి గ్రామం, ప్రతి వార్డులో కాంగ్రెస్ నాయకులను ప్రజలు ప్రశ్నించేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. "కల్యాణలక్ష్మి ఏమైంది? షాదీ ముబారక్ ఏమైంది? ఎన్నికల్లో హామీ ఇచ్చిన తులం బంగారం ఎప్పుడు ఇస్తారు?" అంటూ కాంగ్రెస్ నేతలను ప్రజలు నిలదీయాలని సూచించారు. పేదింటి ఆడబిడ్డల కోసం కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను కాపాడుకోవడంతో పాటు, కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయించే వరకు పోరాటం కొనసాగించాలని కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# వాజ్‌పేయి ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

## భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయికి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘన నివాళి



## ప్రజాస్వామ్య విలువలకు ఆయన పెద్దపీట వేశారు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**హైదరాబాద్, ఆగస్టు 16 (వార్త సంధ్య):** భారత మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు పాల్గొని వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దేశానికి వాజ్‌పేయి అందించిన విశిష్ట సేవలను, ఆయన ఆదర్శవంతమైన రాజకీయ, ప్రజా జీవితాన్ని స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ.. అటల్ బిహారీ వాజ్‌పేయి భారత రాజకీయాల్లో అరుదైన వ్యక్తిత్వం కలిగిన మహోన్నత నాయకుడని అన్నారు. ప్రధానమంత్రిగా దాదాపు ఆరేళ్లకు పైగా దేశాన్ని సమర్థవంతంగా నడిపించి, అభివృద్ధి, మౌలిక వసతులు, సాంకేతిక రంగాల్లో అనేక కీలక మార్పులకు బాటలు వేశారని పేర్కొన్నారు. వాజ్‌పేయి హయాంలో చేపట్టిన జాతీయ రహదారుల నిర్మాణం దేశ రవాణా వ్యవస్థలో కీలక మార్పులకు దోహదపడిందని తెలిపారు. టెలికాం రంగంలో తీసుకొచ్చిన సంస్కరణలు దేశంలో సమాచార, సాంకేతిక రంగాల విస్తరణకు బలమైన పునాది వేశాయని అన్నారు. సామాన్య ప్రజలకు సైతం గ్యాస్ కనెక్షన్లు సులభంగా అందేలా చర్యలు చేపట్టారని గుర్తుచేశారు. దేశాభివృద్ధికి వాజ్‌పేయి తీసుకున్న నిర్ణయాలు, ఆయన దూరదృష్టితో రూపొందించిన విధానాలు బలమైన పునాది వేశాయని రాంచందర్‌రావు పేర్కొన్నారు. భారత రాజకీయ చరిత్రలో వాజ్‌పేయి పరిపాలనా కాలాన్ని ఒక 'స్వర్ణయుగం'గా పరిగణిస్తారని అన్నారు.

### ఒక్క ఓటు తేడాతో ప్రభుత్వం పడిపోయినా..

వాజ్‌పేయి రాజకీయ జీవితంలో పాటించిన నైతిక విలువలను రాంచందర్‌రావు ప్రత్యేకంగా ప్రస్తావించారు. పార్లమెంటులో కేవలం ఒక్క ఓటు తేడాతో ప్రభుత్వం పడిపోయే పరిస్థితి వచ్చినప్పటికీ వాజ్‌పేయి ఎలాంటి రాజీకి తలొగ్గలేదని గుర్తుచేశారు. అధికారం కోసం విలువలను వదులుకోకుండా ప్రజాస్వామ్య స్ఫూర్తికి కట్టుబడి వ్యవహరించిన నాయకుడు వాజ్‌పేయి అని అన్నారు. అధికారాన్ని కాపాడుకోవడం కంటే ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తి, రాజకీయ నైతికతకు ఆయన అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. నేటి రాజకీయాల్లో ఇలాంటి విలువలతో కూడిన నాయకత్వం అవసరమని రాంచందర్‌రావు అన్నారు. యువత, నేటి తరం రాజకీయ నాయకులు వాజ్‌పేయి జీవితాన్ని, ఆయన రాజకీయ ప్రస్థానాన్ని అధ్యయనం చేసి ఆయన పాటించిన ఉన్నతమైన విలువల నుంచి స్ఫూర్తి పొందాలని పిలుపునిచ్చారు.

### దేశ సేవకే జీవితాన్ని అంకితం చేశారు

అటల్ బిహారీ వాజ్‌పేయి తన జీవితాంతం దేశ సేవకే అంకితమయ్యారని రాంచందర్‌రావు తెలిపారు. దేశం, ప్రజలు, ప్రజాస్వామ్య వ్యవస్థపై ఆయనకు ఉన్న నిబద్ధత ఆదర్శప్రాయమన్నారు. వాజ్‌పేయి నిస్వార్థ దేశభక్తి, అంకితభావం, ప్రజాసేవను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆయనకు దేశ అత్యున్నత పౌర పురస్కారం **'భారతరత్న'**ను ప్రదానం చేసిందని పేర్కొన్నారు. వాజ్‌పేయి భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు, దేశం పట్ల ఆయనకున్న అంకితభావం నిరంతరం భారతీయులకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయని రాంచందర్‌రావు అన్నారు.

### యువత వాజ్‌పేయిని ఆదర్శంగా తీసుకోవాలి

దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని రాంచందర్‌రావు అన్నారు. యువత అటల్ బిహారీ వాజ్‌పేయి జీవిత చరిత్రను అధ్యయనం చేయాలని సూచించారు. రాజకీయాల్లో ఉన్నతమైన విలువలు, ప్రజాసేవ, దేశభక్తి, ప్రజాస్వామ్యంపై నిబద్ధత ఎలా ఉండాలో వాజ్‌పేయి జీవితం ద్వారా నేర్చుకోవచ్చని చెప్పారు. వాజ్‌పేయి చూపిన మార్గంలో నడవడం, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని రాంచందర్‌రావు పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అటల్ బిహారీ వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వాజ్‌పేయి సేవలను, దేశానికి ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా పలువురు నాయకులు స్మరించుకున్నారు.

# లక్ష్మీదేవిపల్లి మండలంలో తూము చౌదరి పర్యటన

## అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త పింఛన్లు అందేలా కృషి చేయాలి

## భూ సమస్యలకు త్వరలో శాశ్వత పరిష్కారం: తూము చౌదరి



**లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 16 (వార్త సంధ్య):** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అనుచరులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తూము చౌదరి ఆదివారం లక్ష్మీదేవిపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో నిర్వహించిన కుటుంబ, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలను కలుసుకున్నారు.

పర్యటనలో భాగంగా గడ్డిగుట్ట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో తూము చౌదరి పాల్గొన్నారు. గ్రామానికి చెందిన భూక్యా పార్వతి – మల్సూర్, బోడ గంగ – చందర్ దంపతుల నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దంపతులకు పట్టువస్త్రాలు బహూకరించి, వారి కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం తెలగరామవరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొమ్మెర పవన్ కళ్యాణ్ – సఖిత దంపతుల కుమారుడు నందన్ అన్నప్రాసన వేడుకలో తూము చౌదరి పాల్గొన్నారు. చిన్నారికి పట్టువస్త్రాలు అందించి ఆశీస్సులు తెలిపారు. కారుకొండ, హేమచంద్రపురం, వేపలగడ్డ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులతో తూము చౌదరి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మండలంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త పింఛన్లు అందేలా నాయకులు, కార్యకర్తలు బాధ్యత తీసుకుని దరఖాస్తులు చేయించాలని సూచించారు.n ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఆయన కోరారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక కృషితో తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని తూము చౌదరి ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం దిశగా పనిచేస్తోందని పేర్కొన్నారు. పేదల సంక్షేమం, గృహ నిర్మాణం, పింఛన్లు, భూ సమస్యల పరిష్కారం వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఎం.ఏ. రజాక్, కూచిపూడి జగన్, పూణెం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ నాయకులు ఎండీ. గౌస్ పాషా, సర్పంచ్‌లు బోడ సంతు, జాని, దూబులో, మాజీ సర్పంచ్ బండ వెంకటేశ్వర్లు, యాసారపు నరసింహారావు తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# SSB జవాన్ల కుటుంబాల కోసం 48 నూతన నివాసాలు ప్రారంభం

## ఇబ్రహీంపట్నంలో కొత్తగా నిర్మించిన కుటుంబ క్వార్టర్లను ప్రారంభించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

## జవాన్ల సంక్షేమం, గౌరవానికి మోదీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది

## ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సరిహద్దు భద్రతను బలోపేతం చేస్తున్న SSB

**రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం, ఆగస్టు 16 (వార్త సంధ్య):** దేశ సరిహద్దుల రక్షణలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్న సశస్త్ర సీమా బల్ (SSB) సిబ్బంది సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో SSB సిబ్బంది కోసం కొత్తగా నిర్మించిన 48 కుటుంబ నివాసాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. SSB సిబ్బంది అత్యంత సవాలుతో కూడిన పరిస్థితుల్లో విధులు నిర్వర్తిస్తూ దేశ సరిహద్దులను కాపాడుతున్నారని తెలిపారు. సరిహద్దు భద్రతతో పాటు మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఆయుధాల స్మగ్లింగ్, మానవ అక్రమ రవాణా, అక్రమ వలసలు, నకిలీ కరెన్సీ, వ్యవస్థీకృత నేరాలను అడ్డుకోవడంలో SSB సిబ్బంది కీలకంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

జవాన్ల కుటుంబాలకు భద్రత, భరోసా

ఇబ్రహీంపట్నంలో నిర్మించిన 48 కుటుంబ నివాసాలు కేవలం భవనాలు మాత్రమే కాదని, దేశ రక్షణలో నిత్యం విధులు నిర్వహించే జవాన్ల కుటుంబాల పట్ల కేంద్ర ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధకు ప్రతీకలని బండి సంజయ్ అన్నారు. "ఒక జవాన్ తన కుటుంబానికి సురక్షితమైన గృహవసతి, నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలుసుకున్నప్పుడు మరింత ఆత్మవిశ్వాసంతో, ఏకాగ్రతతో దేశానికి సేవ చేయగలడు" అని పేర్కొన్నారు. జవాన్ల కుటుంబాల సంక్షేమం బలోపేతం చేయడం ద్వారా వారు దేశ రక్షణ విధుల్లో మరింత ధైర్యంగా, నిబద్ధతతో పనిచేసేందుకు అవకాశం ఏర్పడుతుందని అన్నారు.



ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సరిహద్దు భద్రత

SSB ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సరిహద్దు భద్రతను మరింత పటిష్టం చేస్తోందని బండి సంజయ్ ప్రశంసించారు. డ్రోన్లు, సీసీటీవీ నిఘా వ్యవస్థలు, థర్మల్ ఇమేజర్లు, నైట్ విజన్ పరికరాలు, జీపీఎస్ ఆధారిత పెట్రోలింగ్, సురక్షిత డిజిటల్ కమ్యూనికేషన్ వ్యవస్థలు, GIS ఆధారిత ప్రణాళిక వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా సరిహద్దుల పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా మారుతోందని తెలిపారు. మారుతున్న భద్రతా సవాళ్లకు అనుగుణంగా సరిహద్దు భద్రతా బలగాలను ఆధునీకరించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

జవాన్ల సంక్షేమానికి కేంద్రం కట్టుబాటు

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో దేశ భద్రతా బలగాలను మరింత ఆధునీకరించడంతో పాటు వారి కుటుంబాలకు మెరుగైన గృహవసతి,

# 22–ఏ నిషేధిత జాబితాపై అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి పరిశీలన


## రికార్డులు, ఆధార పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు

## గ్రామాల వారీగా పూర్తి వివరాలు సిద్ధం చేయాలని ఆదేశం

**రాజేంద్రనగర్, ఆగస్టు 16 (వార్త సంధ్య):** రాజేంద్రనగర్ మండలంలోని 22-ఏ నిషేధిత జాబితా (Prohibition List) కు సంబంధించిన రికార్డులు, పత్రాలను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి ఆదివారం పరిశీలించారు. రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన 22-ఏ జాబితాకు సంబంధించిన వివరాలను అధికారులతో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. రెవెన్యూ శాఖ మంత్రి అధ్యక్షతన సోమవారం (ఆగస్టు 17) ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న సమీక్షా సమావేశం నేపథ్యంలో అదనపు కలెక్టర్ ఈ పరిశీలన చేపట్టారు. మండలంలో 22-ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించిన రికార్డులు, ఆధార పత్రాలను పరిశీలించి వివరాలను సరి చూసుకున్నారు.

### గ్రామాల వారీగా పరిశీలన

ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల వారీగా 22-ఏ జాబితాలో చేర్చిన భూముల వివరాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఆయా భూములకు సంబంధించిన రెవెన్యూ రికార్డులు, రిజిస్టర్లు, సంబంధిత ఉత్తర్వులు, ఇతర ఆధార పత్రాలను జాబితాతో సరిపోల్చి చూడాలని అధికారులను ఆదేశించారు. 22-ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల వివరాల్లో ఎలాంటి పొరపాట్లు, వ్యత్యాసాలు లేకుండా రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ప్రతి గ్రామానికి సంబంధించిన జాబితాను అందుబాటులో ఉన్న డాక్యుమెంట్లతో సరిపోల్చి పూర్తి వివరాలను సిద్ధం చేయాలని ఆదేశించారు.



### సమీక్షకు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలి

22-ఏ కింద చేర్చిన భూములకు సంబంధించి అందుబాటులో ఉన్న రిజిస్టర్లు, రెవెన్యూ రికార్డులు, ప్రభుత్వ ఉత్తర్వులు, ఇతర ఆధార పత్రాలను క్రమబద్ధంగా పరిశీలించాలని చంద్రారెడ్డి సూచించారు. గ్రామాల వారీగా 22-ఏ నిషేధిత జాబితాకు సంబంధించిన సమాచారాన్ని స్పష్టంగా, ఆధారాలతో కూడిన విధంగా సిద్ధం చేసి సోమవారం నిర్వహించే సమీక్షా సమావేశానికి అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి రికార్డులను మరోసారి పరిశీలించాలని, సమీక్షా సమావేశంలో అవసరమైన పూర్తి సమాచారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉండాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ రాములు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వార్త సంధ్య

# సీసీ రోడ్డును ప్రారంభించిన సర్పంచ్ బానోత్ పద్మావతి

## ఎంపీ నిధులతో పేరుపల్లిలో రోడ్డు నిర్మాణం అభివృద్ధి పనులకు గ్రామస్తుల హర్షం



**సింగరేణి, ఆగస్టు 16 (వార్త సంధ్య):** సింగరేణి మండలం పేరుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును గ్రామ సర్పంచ్ బానోత్ పద్మావతి వీరభద్రం ప్రారంభించారు. ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి ఎంపీ నిధుల నుంచి మంజూరైన ఈ రోడ్డు నిర్మాణం పూర్తికావడంతో శనివారం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు.

తెల్లగొర్ల పిచ్చయ్య ఇంటి నుంచి సుశీలమ్మ ఇంటి వరకు నిర్మించిన సీసీ రోడ్డును సర్పంచ్ బానోత్ పద్మావతి వీరభద్రం ప్రారంభించారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. రోడ్డు నిర్మాణంతో స్థానిక ప్రజలకు రాకపోకలకు సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, సొసైటీ డైరెక్టర్ మధ్యానపు శ్రీనివాసరావు, వార్డు మెంబర్ బాణోత్ వీరభద్రు, పులకాని సత్తిరెడ్డి, మేడ వెంకన్న, మాజీ గుడి చైర్మన్ పుట్టా నాగేశ్వరరావు, బుడిగ సత్యనారాయణ, తెల్లగొర్ల పిచ్చయ్య, బండారు రామకోటి, బండారు శ్రీనివాసరావు, కాలపాక వెంకటేశ్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బండారు మురళి, తెల్లగొర్ల భద్రి తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల విద్యార్థులపై దాడి దుర్మార్గం



## బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి

## పాఠశాల ఎదుట PDSU, USFI, GVS విద్యార్థి సంఘాల ధర్నా

**సింగరేణి, ఆగస్టు 16 (వార్త సంధ్య):** సింగరేణి మండలంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సుమారు 15 మంది విద్యార్థులపై సీనియర్ విద్యార్థులు దాడికి పాల్పడిన ఘటనను PDSU, USFI, GVS విద్యార్థి సంఘాలు తీవ్రంగా ఖండించాయి. విద్యార్థులపై దాడికి పాల్పడిన వారితో పాటు పాఠశాల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.

ఈ ఘటనపై PDSU జిల్లా అధ్యక్షుడు జి. మస్తాన్, USFI జిల్లా కార్యదర్శి బొట్ల సాగర్, GVS విద్యార్థి సంఘం నాయకుడు బాలాజీ నాయక్ మాట్లాడుతూ.. సీనియర్ విద్యార్థుల వేధింపులు, దాడులు తాళలేక పదో తరగతి విద్యార్థులు భయంతో రాత్రంతా సమీపంలోని అడవిలో తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడటం ఆందోళనకరమన్నారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులకు కనీస భద్రత లేకుండా పోయిందని ఆరోపించారు.

విద్యార్థులపై దాడులు జరుగుతున్నప్పటికీ వార్డెన్, ప్రిన్సిపాల్ పర్యవేక్షణ లోపించడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. పాఠశాల ఎదుట ధర్నా విద్యార్థులపై జరిగిన దాడిని నిరసిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యంతో PDSU, USFI, GVS విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల భద్రతకు సంబంధించి అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన విద్యార్థులపై, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డెన్, ప్రిన్సిపాల్‌పై సమగ్ర విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు భద్రత కల్పించాలి

గురుకులంలో చదువుతున్న విద్యార్థులందరికీ పూర్తిస్థాయి భద్రత కల్పించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దాడికి గురై తీవ్ర భయాందోళనకు గురైన పదో తరగతి విద్యార్థులకు ధైర్యం కల్పించడంతో పాటు అవసరమైన వైద్య చికిత్స, ప్రత్యేక కౌన్సెలింగ్ అందించాలని కోరారు. పాఠశాలలో విద్యార్థుల భద్రతపై అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వడంతో పాటు ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు.

# ఎల్ఐసీ ఉద్యోగులకు ఓపీఎస్ అమలు చేయాలి

## పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని డిమాండ్

## జాతీయ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇన్సూరెన్స్ వర్కర్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ టీ. సూరికుమార్




**హైదరాబాద్, ఆగస్టు 16 (వార్త సంధ్య):** ఎల్ఐసీ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను అమలు చేసి న్యాయం చేయాలని జాతీయ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇన్సూరెన్స్ వర్కర్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ టీ. సూరికుమార్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ సికింద్రాబాద్ డివిజన్ల తరహాలో హైదరాబాద్ జోన్ కార్యాలయ పరిధిలోని ఎల్ఐసీ కార్యాలయాల్లో పనిచేస్తున్న సుమారు 400 మంది ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ విషయంపై పలుమార్లు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ 16 ఏళ్లుగా జాప్యం జరుగుతోందని తెలిపారు. ఈ జాప్యం కారణంగా ఉద్యోగులు సర్వీస్ సంబంధిత ప్రయోజనాలు, పదోన్నతులు, ఇతర ప్రయోజనాలను కోల్పోయారని, ఫలితంగా వారికి భారీగా ఆర్థిక నష్టం వాటిల్లిందని సూరికుమార్ పేర్కొన్నారు.

**ఓపీఎస్ ప్రయోజనం కోల్పోయిన ఎల్ఐసీ ఉద్యోగులకు తగిన న్యాయం చేయాలని కోరారు.**

కేంద్ర ప్రభుత్వ నిర్ణయం నేపథ్యంలో అమలు చేయాలి

2023 మార్చి 20న కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 57 అనంతరం తెలుగు రాష్ట్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఓపీఎస్ సాధించే దిశగా ప్రయత్నాలు ప్రారంభించామని ఆయన తెలిపారు. ఎల్ఐసీ ఎండీతో పాటు ఈడీ (పర్సనల్)తో చర్చలు జరిపి ఉద్యోగులకు రావాల్సిన పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు.

పలువురు కేంద్ర మంత్రులకు వినతిపత్రాలు

ఈ సమస్య పరిష్కారం కోసం రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు సూరికుమార్ తెలిపారు. కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి, బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌లకు కూడా వినతిపత్రాలు అందజేసినట్లు చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం, ఎల్ఐసీ యాజమాన్యం స్పందించి ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేసి న్యాయం చేయాలని టీ. సూరికుమార్ కోరారు. ఈ సమావేశంలో సెక్రటరీ బీసీ వేణుమాధవ్, జోనల్ ప్రెసిడెంట్ ఎం.డి. దయాకర్, జోనల్ జనరల్ సెక్రటరీ ఎస్. రాజ్‌కుమార్, జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్‌కుమార్, డివిజన్ నాయకులు హరికిషన్, టీ. వీరేందర్, కే. వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మైదాన ప్రాంత హక్కుల సాధనకై బంజారా సేవాదళ్ రాష్ట్ర కమిటీ

## గిరిజన ప్రాంతాలకు పునర్విభజనలో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలి

## బంజారా సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు నేనావత్ అజయ్‌నాయక్ డిమాండ్

**హైదరాబాద్, ఆగస్టు 16 (వార్త సంధ్య):** మైదాన ప్రాంత గిరిజనుల హక్కుల సాధన కోసం బంజారా సేవాదళ్ రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేసినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు నేనావత్ అజయ్‌నాయక్ తెలిపారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలోని లంబాడీ గిరిజనులకు 50 ఏళ్ల పాటు సాగిన ఉద్యమాలు, పోరాటాల ఫలితంగా 1976లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో ఎస్టీ రిజర్వేషన్ లభించిందని అజయ్‌నాయక్ తెలిపారు.

**అసెంబ్లీ స్థానాల్లో అన్యాయం**



12 అసెంబ్లీ నియోజకవర్గాలను గిరిజనులకు కేటాయించగా.. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు 5, ఉమ్మడి వరంగల్ జిల్లాకు 3, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు 3, ఉమ్మడి నల్గొండ జిల్లాకు ఒక స్థానం కేటాయించారని తెలిపారు. రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో ఒక్క గిరిజన రిజర్వుడ్ నియోజకవర్గం కూడా కేటాయించలేదని ఆరోపించారు. ఇప్పటివరకు 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికలు జరిగాయని, ప్రతి జిల్లాలో కనీసం ఒకటి లేదా రెండు గిరిజన నియోజకవర్గాలు ఉంటే రాష్ట్రంలో 16 నుంచి 32 మంది గిరిజన ఎమ్మెల్యేలు ఉండే అవకాశం ఉండేదని పేర్కొన్నారు. గిరిజనులకు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దాలని, రాబోయే నియోజకవర్గాల పునర్విభజనలో ప్రతి గిరిజన ప్రాంతానికి సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని అజయ్‌నాయక్ డిమాండ్ చేశారు.

**మైదాన ప్రాంత గిరిజనులకు ప్రాతినిధ్యం**

బంజారా సేవాదళ్ రాష్ట్ర కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ రాష్ట్రంలోని గిరిజనుల్లో సుమారు 70 శాతం మంది మైదాన ప్రాంతాల్లో నివసిస్తున్నారని తెలిపారు. మైదాన ప్రాంత గిరిజనులకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.మైదాన ప్రాంత గిరిజనులకు ఒక ఉప ముఖ్యమంత్రి పదవి, రెండు ఎమ్మెల్సీ పదవులు, ఒక రాజ్యసభ సీటు కేటాయించాలని కోరారు. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**రాష్ట్ర కమిటీ ఏర్పాటు**

మైదాన ప్రాంత గిరిజనుల హక్కుల కోసం రాష్ట్రవ్యాప్తంగా బంజారా సేవాదళ్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా బంజారా సేవాదళ్ రాష్ట్ర కమిటీని ప్రకటించారు. కార్యక్రమంలో బంజారా సేవాదళ్ రాష్ట్ర నాయకులు సురేష్ ఇస్లావత్, హనుమంతు నాయక్‌తో పాటు పలువురు గిరిజన నాయకులు పాల్గొని ప్రసంగించారు.

# బేగంబజార్‌లో అక్రమ పేకాట స్థావరంపై పోలీసుల దాడి

## నగదు పందాలతో జోరుగా జూదం.. 10 మంది పట్టివేత రూ. 1.18 లక్షల నగదు, 13 పేక ముక్కల ప్యాకెట్లు, హుక్కా సామగ్రి స్వాధీనం

**హైదరాబాద్, ఆగస్టు 16 :** నగరంలోని బేగంబజార్ ఛత్రిలో అక్రమంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై గోషామహల్ పోలీసులు దాడి చేసి 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. పక్కా సమాచారంతో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు ఓ ఇంట్లోని నాలుగో అంతస్తులో తనిఖీలు నిర్వహించగా.. నగదు పందాలతో పేకాట ఆడుతున్న 10 మంది పట్టుబడ్డారు. పోలీసుల తనిఖీల్లో రూ.1,18,800 నగదు, 13 పేక ముక్కల ప్యాకెట్లు, క్యాసినో గేమ్‌లో ఉపయోగించే బిల్లియం/కాయిన్లు, హుక్కా సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. పట్టుబడిన వ్యక్తులను స్వాధీనం చేసుకున్న వస్తువులు, సంబంధిత పత్రాలతో కలిపి గోషామహల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఈ ఘటనపై తెలంగాణ గేమింగ్ చట్టంలోని సెక్షన్లు 3, 4 కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బహిరంగ ప్రదేశంలో ధూమపానానికి సంబంధించిన COTPA నిబంధనలతో పాటు, BNSలోని పెటీ ఆర్గనైజ్డ్ క్రైమ్ నిబంధన కింద కూడా కేసు నమోదు చేసినట్లు సమాచారం. పట్టుబడిన వారందరికీ BNSS సెక్షన్ 35(3) కింద నోటీసులు జారీ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. బేగంబజార్ ఛత్రిలోని ఓ ఇంట్లో నగదు పందాలతో పేకాట జరుగుతోందన్న సమాచారంతో పోలీసులు ముందస్తు అనుమతులు తీసుకుని, మధ్యవర్తుల సమక్షంలో దాడి నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఘటనపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

# 22–ఏ భూ రికార్డుల పునఃపరిశీలన పక్కా ఆధారాలతో పూర్తి చేయాలి

**ప్రభుత్వ ప్రయోజనం ఉన్న భూములు మాత్రమే 22–ఏ జాబితాలో ఉండాలి**

**ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక వర్క్‌షీట్.. సబ్‌రిజిస్ట్రార్లతో సమన్వయం తప్పనిసరి**

**అధికారులకు జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి స్పష్టమైన ఆదేశాలు**

**హైదరాబాద్, ఆగస్టు 16 (వార్త సంధ్య):** సెక్షన్ 22-ఏ కింద ఉన్న భూ రికార్డులను సమగ్రంగా పునఃపరిశీలించి, ప్రభుత్వ ప్రయోజనం ఉన్న భూములను మాత్రమే 22-ఏ నిషేధిత జాబితాలో కొనసాగించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రయోజనం లేని భూములను సంబంధిత రికార్డులు, ప్రభుత్వ ఉత్తర్వులు, న్యాయపరమైన ఆధారాలను పరిశీలించి నిబంధనల ప్రకారం జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సెక్షన్ 22-ఏ భూ రికార్డుల సవరణపై నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి సర్వే నంబర్‌ను లోతుగా పరిశీలించాలని అన్నారు. కేవలం గతంలో 22-ఏ జాబితాలో ఉందనే కారణంతో భూమిని కొనసాగించరాదని స్పష్టం చేశారు. 22-ఏలో కొనసాగించడానికి స్పష్టమైన ప్రభుత్వ ప్రయోజనం, సంబంధిత రికార్డులు, పక్కా ఆధారాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు.

### ప్రభుత్వ ప్రయోజనం ఉన్న కేటగిరీలనే పరిశీలించాలి

సెక్షన్ 22-ఏలోని 1-ఏ నుంచి 1-ఈ వరకు కేటగిరీలను సంబంధిత నిబంధనలు, ప్రభుత్వ ఉత్తర్వులు, రెవెన్యూ రికార్డుల ఆధారంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. అసైన్డ్ ల్యాండ్స్, ప్రభుత్వ భూములు, వక్ఫ్, ఎండోమెంట్, భూదాన్, సీలింగ్, యూఎల్‌సీ తదితర ప్రభుత్వ ప్రయోజనం ఉన్న భూములకు సంబంధించిన పూర్తి ఆధారాలను పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రయోజనం లేదని రికార్డుల ద్వారా నిర్ధారణ అయిన భూములను 22-ఏ జాబితా నుంచి తొలగించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ఖస్రా పహాణీ, పహాణీ, ఐజీఆర్ఎస్ రికార్డులు, పాత–కొత్త సర్వే నంబర్లు, గెజిట్ నోటిఫికేషన్లు, యూఎల్‌సీ/సీలింగ్ రికార్డులు, ల్యాండ్ అక్విజిషన్ రికార్డులు, ప్రభుత్వ ఉత్తర్వులు తదితర ఆధారాలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు

.

### పాత రికార్డులను ప్రస్తుత పరిస్థితులతో సరిపోల్చాలి

గతంలో వివిధ కారణాలతో 22-ఏ జాబితాలో చేరిన భూములకు సంబంధించి అనంతరం రెగ్యులరైజేషన్, ప్రభుత్వ ఉత్తర్వులు, కోర్టు ఆదేశాలు లేదా ఇతర మార్పులు జరిగినప్పటికీ రికార్డులు అప్‌డేట్ కాకపోవడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. అందువల్ల ప్రతి సర్వే నంబర్‌ను ప్రస్తుత రికార్డులతో క్రాస్ వెరిఫై చేయాలని ఆదేశించారు. తప్పుగా నమోదైన విస్తీర్ణం, సర్వే నంబర్, కేటగిరీ తదితర వివరాలను సరిచేయాలని సూచించారు. జీరో ఎక్స్‌టెంట్ ఉన్న చోట సరైన వివరాలు నమోదు చేయడంతో పాటు అధికంగా నమోదైన విస్తీర్ణాన్ని సవరించాలని తెలిపారు. రెగ్యులరైజ్ అయిన విస్తీర్ణాన్ని సంబంధిత ఆధారాల ప్రకారం గుర్తించి, అవసరమైన సవరణలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

### పార్ట్ సర్వే నంబర్లపై ప్రత్యేక శ్రద్ధ

పార్ట్ సర్వే నంబర్ల విషయంలో అధికారులు మరింత జాగ్రత్తగా



వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఒకే సర్వే నంబర్‌లో కొంత విస్తీర్ణం రెగ్యులరైజ్ అయి, మిగిలిన భాగం ప్రభుత్వ ప్రయోజనంలో ఉన్న సందర్భాల్లో రెండు భాగాల వివరాలను స్పష్టంగా గుర్తించాలని తెలిపారు. ప్రతి పార్ట్ సర్వే నంబర్‌కు సంబంధించిన మొత్తం విస్తీర్ణం, రెగ్యులరైజ్డ్ భాగం, ప్రభుత్వ ప్రయోజనంలో ఉన్న మిగిలిన భాగం, సంబంధిత డాక్యుమెంటరీ ఆధారాలను స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు.

### వక్ఫ్, భూదాన్, సీలింగ్, యూఎల్‌సీ భూములపై లోతైన పరిశీలన

వక్ఫ్ భూములకు సంబంధించి గెజిట్‌లోని వివరాలను అసలు రికార్డులతో సరిపోల్చాలని కలెక్టర్ సూచించారు. వక్ఫ్ జాబితాలోని నంబర్‌ను పొరపాటున సర్వే నంబర్‌గా నమోదు చేసిన సందర్భాలను గుర్తించి సరిచేయాలని తెలిపారు. భూదాన్ భూముల విషయంలో పాత సర్వే నంబర్, కొత్త సర్వే నంబర్, సంబంధిత పాత రికార్డులు, భూమి వాస్తవ పరిస్థితిని పరిశీలించాలని సూచించారు. అవసరమైతే ఫీల్డ్ వెరిఫికేషన్ నిర్వహించి పూర్తి ఆధారాలతో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. సీలింగ్, యూఎల్‌సీ భూముల్లో రెగ్యులరైజ్ అయిన విస్తీర్ణం, సర్ప్లస్‌గా మిగిలిన విస్తీర్ణాన్ని విడివిడిగా గుర్తించి సర్వే నంబర్ వారీగా పూర్తి వివరాలు సిద్ధం చేయాలని తెలిపారు.

ప్రైవేట్ వివాదాలను 22-ఏతో ముడిపెట్టవద్దు

ప్రైవేట్ వ్యక్తుల మధ్య వివాదాలు, కోర్టు కేసులు, స్టే, స్టేటస్‌కో, ఇంజంక్షన్ ఆర్డర్లు, ఐటీ/ఈడీ/ఏసీబీ అటాచ్మెంట్లు తదితర అంశాలను కేవలం ఆ కారణంతో 22-ఏ జాబితాలో చేర్చరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇలాంటి అంశాలకు సంబంధిత ప్రత్యేక రికార్డులు, మాడ్యూల్స్ లేదా ప్రత్యేక జాబితాలు నిర్వహించాలని సూచించారు. వ్యవసాయ భూములకు సంబంధించిన కోర్టు కేసులు, అటాచ్మెంట్లు తదితర అంశాలను సంబంధిత ఆన్‌లైన్ మాడ్యూల్‌లో నమోదు చేసి నిబంధనల ప్రకారం నిర్వహించాలని తెలిపారు.

### సబ్‌రిజిస్ట్రార్లతో సమన్వయం తప్పనిసరి

22-ఏకు సంబంధించి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదు, అభ్యంతరం లేదా సందేహాన్ని సంబంధిత తహసీల్దార్లు సబ్‌రిజిస్ట్రార్‌తో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి కేసుకు ప్రత్యేక రిమార్క్ నమోదు చేసి కేసు సంఖ్య, సర్వే నంబర్, అభ్యంతర స్వరూపం, పరిశీలించిన ఆధారాలు, తీసుకున్న నిర్ణయం తదితర వివరాలను రోజువారీ ప్రొఫార్మాలో నమోదు చేయాలని సూచించారు. అవసరమైన రికార్డులను పూర్తిగా పరిశీలించకుండా వెంటనే ప్రతికూల సమాధానం ఇవ్వవద్దని అన్నారు. అవసరమైతే రెండు, మూడు రోజుల సమయం తీసుకుని పక్కా ఆధారాలతో స్పష్టమైన సమాధానం ఇవ్వాలని సూచించారు. తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఒకే సమాచారంతో సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

### ప్రతి సర్వే నంబర్‌కు వర్క్‌షీట్ తప్పనిసరి

22-ఏ సవరణ ప్రక్రియలో ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక వర్క్‌షీట్ సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అందులో పాత స్థితి, ప్రస్తుత స్థితి, మార్పుకు కారణం, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు, రికార్డు ఆధారాలు, విస్తీర్ణ వివరాలు, ప్రతిపాదిత చర్య వంటి అంశాలను స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. "ఈ సర్వే నంబర్‌ను 22-ఏలో ఎందుకు కొనసాగిస్తున్నాం? దీనికి ప్రభుత్వ ప్రయోజనం ఏమిటి? అందుకు ఆధారం ఏమిటి?" అనే ప్రశ్నలకు ప్రతి కేసులో స్పష్టమైన సమాధానం ఉండేలా అధికారులు రికార్డులను సిద్ధం చేసుకోవాలని సూచించారు.

### పెండింగ్ పనులను వేగవంతం చేయాలి

మండలాల వారీగా పూర్తయిన ఫార్ములు, సవరణలకు పంపిన ఫార్ములు, పెండింగ్‌లో ఉన్న గ్రామాలు, గుర్తించిన తప్పులు, పరిష్కరించిన అంశాల వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న గ్రామాల పనులను త్వరితగతిన పూర్తి చేసి అవసరమైన డాక్యుమెంటరీ ఆధారాలతో జిల్లా స్థాయికి పంపాలని సూచించారు. పెద్ద విస్తీర్ణాలకు సంబంధించిన కేసులు, పార్ట్ సర్వే నంబర్లు, యూఎల్‌సీ/సీలింగ్, వక్ఫ్, భూదాన్, హెచ్ఎండీఏ తదితర సున్నితమైన అంశాలను ప్రత్యేకంగా పరిశీలించాలని తెలిపారు.

### పారదర్శకమైన రికార్డులే లక్ష్యం

సెక్షన్ 22-ఏ సవరణ ప్రక్రియలో ప్రభుత్వ ప్రయోజనం ఉన్న భూమి పొరపాటున జాబితా నుంచి తొలగిపోకుండా, అదే సమయంలో ప్రభుత్వ ప్రయోజనం లేని భూమి జాబితాలో కొనసాగకుండా అధికారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని కలెక్టర్ సి. నారాయణరెడ్డి స్పష్టం చేశారు. క్లారిటీ లేని అంశాలను స్వయంగా నిర్ణయించి ముందుకు పంపకుండా అవసరమైన సందర్భాల్లో ఉన్నతాధికారుల నుంచి స్పష్టత తీసుకోవాలని సూచించారు. ప్రతి అధికారి తన పరిధిలోని రికార్డులను పూర్తిగా పరిశీలించి, అవసరమైనప్పుడు పక్కా ఆధారాలతో సమాధానం చెప్పే విధంగా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రయోజనం ఉన్న భూముల పరిరక్షణ, తప్పుగా నమోదైన వివరాల సవరణ, ఖచ్చితమైన రికార్డు నిర్వహణ, రెవెన్యూ–రిజిస్ట్రేషన్ శాఖల మధ్య సమన్వయం ద్వారా సెక్షన్ 22-ఏ భూ రికార్డులను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి స్పష్టం చేశారు.

# 2027 జనాభా లెక్కల్లో OBC/SEBCలకు ప్రత్యేక కేటగిరీ ఏర్పాటు చేయాలి

**ప్రధాని నరేంద్ర మోదీకి మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ**

**కులగణనకు శాస్త్రీయ, పారదర్శక విధానం అవసరం**

**రాష్ట్రాల వారీగా మాస్టర్ కుల డైరెక్టరీ, డిజిటల్ కోడ్లు రూపొందించాలని సూచన**

**హైదరాబాద్, ఆగస్టు 16 (వార్త సంధ్య):** 2027లో నిర్వహించనున్న జనాభా లెక్కల్లో ఇతర వెనుకబడిన తరగతులు (OBC), సామాజికంగా మరియు విద్యాపరంగా వెనుకబడిన తరగతులు (SEBC) జనాభాను శాస్త్రీయంగా, పారదర్శకంగా నమోదు చేసేలా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. ఈ మేరకు ప్రధానికి లేఖ రాసిన మంత్రి.. OBC, SEBCల సమగ్ర గణనకు సంబంధించి పలు కీలక సూచనలు చేశారు.

వెనుకబడిన వర్గాల వాస్తవ జనాభా, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన విశ్వసనీయ సమాచారం అందుబాటులో ఉంటేనే రిజర్వేషన్లు, విద్య, ఉపాధి, సంక్షేమం, సమాన ప్రాతినిధ్యం వంటి విధానాలను సమర్థవంతంగా అమలు చేయడానికి అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు.

### OBC/SEBCలకు ప్రత్యేక కేటగిరీ అవసరం

SC, STలకు ప్రత్యేక కేటగిరీలు ఉన్నట్లుగానే జనాభా లెక్కల ప్రశ్నావళిలో OBC/SEBCలకు కూడా స్పష్టమైన ప్రత్యేక కేటగిరీని ఏర్పాటు చేయాలని పొన్నం ప్రభాకర్ కోరారు. కేవలం వ్యక్తులు తమ కులం పేరును నమోదు చేయడం ద్వారా OBC/SEBC గుర్తింపు అనంతరం అధికారిక వర్గీకరణపై ఆధారపడే పరిస్థితి రాకుండా ముందుగానే స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని సూచించారు.

### SECC–2011లో ఎదురైన సమస్యలు పునరావృతం కాకూడదు

2011 సామాజిక-ఆర్థిక, కుల గణనలో కులాల పేర్లను ఓపెన్ ఎండెడ్ విధానంలో నమోదు చేయడం వల్ల స్పెల్లింగ్ తేడాలు, స్థానిక పేర్లు, పర్యాయపదాలు, ఉపకులాలు, ఉచ్చారణలోని మార్పుల కారణంగా అనేక రకాల కులపేర్లు నమోదయ్యాయని మంత్రి ప్రస్తావించారు. 2027 జనాభా లెక్కల్లో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రమాణీకృత విధానాన్ని ముందుగానే రూపొందించాలని కేంద్రాన్ని కోరారు.

### తెలంగాణ SEEPC సర్వే అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోవాలి

తెలంగాణలో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే (SEEPC) 2024–25 ద్వారా ఇంటింటి స్థాయిలో నిర్మిత డేటా సేకరణ, కుల సమాచారాన్ని పద్ధతిగా నమోదు చేయడం, వెనుకబడిన వర్గాల వర్గీకరణలో అనుభవం లభించిందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణలో సేకరించిన ఈ అనుభవాలను జాతీయ స్థాయిలో 2027 జనాభా లెక్కల రూపకల్పనలో పరిగణనలోకి తీసుకోవాలని ప్రధానమంత్రిని కోరారు.

### కేంద్రానికి మంత్రి కీలక సూచనలు

2027 జనాభా లెక్కల్లో OBC/SEBCల సమగ్ర గణన కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలను మంత్రి తన లేఖలో వివరించారు.

SC, STలతో పాటు OBC/SEBCలకు ప్రత్యేక కేటగిరీని జనాభా లెక్కల ప్రశ్నావళిలో చేర్చాలి. రాష్ట్రాల వారీగా సమగ్ర మాస్టర్ కుల డైరెక్టరీ రూపొందించాలి. కులాలు, సముదాయాలకు ప్రత్యేక డిజిటల్ కోడ్లు కేటాయించాలి. జాబితాలో లేని, వివాదాస్పదమైన లేదా స్థానికంగా గుర్తింపు పొందిన కులపేర్లను ప్రత్యేకంగా నమోదు చేసి ధృవీకరించే విధానం



ఏర్పాటు చేయాలి. వ్యక్తి స్వయంగా ప్రకటించిన కులం, దానికి సంబంధించిన అధికారిక వర్గీకరణ రెండింటినీ డేటాలో భద్రపరచాలి. కేవలం కులపేర్లను సేకరించకుండా రిజర్వేషన్లు, ప్రాతినిధ్యం, విద్య, ఉపాధి, సంక్షేమం, సామాజిక-ఆర్థిక అభివృద్ధికి ఉపయోగపడే విశ్వసనీయమైన OBC/SEBC డేటాసెట్ రూపొందించాలి.

### సామాజిక న్యాయానికి కీలకమైన సమాచారం

దేశంలో సామాజిక న్యాయం, సమాన ప్రాతినిధ్యం, రిజర్వేషన్లు, విద్యా అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, లక్ష్యిత సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనకు విశ్వసనీయమైన కులవారీ జనాభా సమాచారం ఎంతో అవసరమని మంత్రి పేర్కొన్నారు

.

జనాభా లెక్కల దశలోనే విధానపరమైన స్పష్టత లేకపోతే భవిష్యత్తులో ఆ డేటాను సమర్థవంతంగా వినియోగించడం కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉందన్నారు. అందువల్ల 2027 జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభానికి ముందే OBC/SEBCల గణనకు అవసరమైన పద్ధతులు, సాంకేతిక ప్రమాణాలు, డేటా రక్షణ చర్యలను అమలు చేయాలని పొన్నం ప్రభాకర్ ప్రధానమంత్రిని కోరారు. ఈ చర్యల ద్వారా దేశంలోని వెనుకబడిన వర్గాల జనాభా వాస్తవికతను సమగ్రంగా నమోదు చేసి, భవిష్యత్ విధాన నిర్ణయాలకు ఉపయోగపడే శాస్త్రీయమైన, విశ్వసనీయమైన సమాచారాన్ని అందుబాటులోకి తీసుకురావచ్చని మంత్రి పేర్కొన్నారు.

# ఫిల్మ్‌నగర్‌లో పండ్ల వ్యాపారిపై దాడి

**పాత వివాదంతో ఘర్షణ.. పండ్ల వ్యాపారి, సోదరుడిపై దాడి**

**12 మందిపై కేసు నమోదు చేసిన ఫిల్మ్‌నగర్ పోలీసులు**

**హైదరాబాద్, ఆగస్టు 16:** ఫిల్మ్‌నగర్‌లో పండ్ల వ్యాపారి షేక్ ముబారక్ అలీ, ఆయన సోదరుడు ముషారఫ్ అలీపై దాడి, బెదిరింపులకు పాల్పడ్డారన్న ఫిర్యాదుతో 12 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు ఇరువర్గాల మధ్య గతంలో ఉన్న వివాదమే కారణమని పోలీసులు తెలిపారు.

పోలీసుల వివరాల ప్రకారం.. ఆగస్టు 10న మోహన్ కొల్లాపురి, అశోక్‌తో పాటు మరికొందరు పండ్ల దుకాణం వద్దకు వచ్చి తమను దూషించి, బెదిరించినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. ఇదే అంశంపై ఇరువర్గాల మధ్య గతంలోనూ మూడు సార్లు గొడవలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు.

ఫిర్యాదు ఆధారంగా ఫిల్మ్‌నగర్ పోలీసులు 12 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు దారితీసిన కారణాలు, ఇరువర్గాల మధ్య ఉన్న పాత వివాదం, దాడిలో పాల్గొన్న వారి పాత్రపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉన్నందున నిందితులపై వచ్చిన ఆరోపణలు దర్యాప్తు పూర్తయ్యే వరకు ఆరోపణలుగానే పరిగణించాలి.

# మంత్రి సీతక్క సమన్వయంతో సీఎం ములుగు పర్యటన విజయవంతం



### మేడారం నుంచి ములుగు వరకు ఘన స్వాగతం

### అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం

### ములుగు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి: సీఎం రేవంత్‌రెడ్డి

### "తెలంగాణ ఆడబిడ్డ సీతక్క" అంటూ ముఖ్యమంత్రి ప్రశంసలు

**ములుగు, ఆగస్టు 16 (వార్త సంధ్య):** మంత్రి సీతక్క సమన్వయంతో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజల భాగస్వామ్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ములుగు జిల్లా పర్యటన విజయవంతంగా ముగిసింది. మేడారం నుంచి ములుగు వరకు ముఖ్యమంత్రికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా సీఎం పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

**మేడారంలో సీఎం ప్రత్యేక పూజలు**

మేడారం చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రి సీతక్క ఘన స్వాగతం పలికారు.



హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గంలో సమ్మక్క – సారలమ్మ ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి స్థానిక ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఆలయ ప్రాంగణంలో ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం పూజారులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. అనంతరం సమ్మక్క—సారలమ్మ గద్దెల వద్ద ముఖ్యమంత్రి మొక్కులు చెల్లించుకుని అమ్మవార్లకు నిలువెత్తు బంగారం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క సీఎంకు ఆప్యాయంగా అమ్మవారి బొట్టు పెట్టారు. సమ్మక్క – సారలమ్మ తల్లుల సన్నిధిలో మంత్రి సీతక్క ముఖ్యమంత్రికి రాఖీ కట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రి సీతక్కకు సమ్మక్క—సారలమ్మ బంగారం (బెల్లం)ను బహూకరించారు. మంత్రి సీతక్క సీఎంకు నూతన వస్త్రాలు, ఆలయ ప్రసాదాలను అందజేశారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌లకు కూడా నూతన వస్త్రాలను బహూకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులను ముఖ్యమంత్రి ఆప్యాయంగా పలకరిస్తూ వారితో కరచాలనం చేశారు.




**మహిళా సంక్షేమానికి మరో ముందడుగు**

ములుగులో వితంతు, ఒంటరి మహిళలకు చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. పలువురు మహిళలకు స్వయంగా పింఛన్లు అందజేశారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులతో సీఎం ముచ్చటించి వారి సమస్యలు, ఆర్థిక కార్యకలాపాల గురించి తెలుసుకున్నారు. మహిళా సంఘాల సభ్యులతో ఫొటోలు దిగారు. ఇందిరా మహిళా శక్తి పాలసీ ద్వారా మహిళా సంఘాలకు అందుతున్న ప్రయోజనాలను సభ్యులు ముఖ్యమంత్రికి వివరించారు. సొంత వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా బలోపేతం అవుతున్న మహిళల విజయగాథలను SERP CEO దివ్య దేవరాజన్ సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులు ముఖ్యమంత్రికి ఇప్పపువ్వు లడ్డూలను బహూకరించారు.

**ములుగు అభివృద్ధికి భారీగా ఊతం**

ములుగులో పంచాయతీరాజ్ హామ్ రహదారుల పైలాన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క కలిసి ఆవిష్కరించారు. అనంతరం ములుగు సమీకృత కలెక్టరేట్ కార్యాలయాన్ని



ఇద్దరూ కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని కూడా ముఖ్యమంత్రి, మంత్రి సీతక్క ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్పెషల్ సీఎస్ దాన కిశోర్, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**ములుగును అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం**

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ములుగు నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక ఆత్మీయ సోదరుడిగా అండగా నిలుస్తున్నారని అన్నారు. ములుగు జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ముఖ్యమంత్రి విచ్చేయడం పట్ల ములుగు ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ములుగు అంటే నిరక్షరాస్యత, అభివృద్ధి లేమి అనే అభిప్రాయం ఉండేదని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి ప్రతి గడపకు తీసుకెళ్తోందని సీతక్క తెలిపారు. హైదరాబాద్‌తో పోటీపడేలా ములుగును అభివృద్ధి చేసే దిశగా ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు.

**ములుగు జిల్లా ఏర్పాటుకు పోరాటం గుర్తు**

పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో రేవంత్‌రెడ్డి, స్వర్గీయ నల్లెల్ల కుమారస్వామి చేసిన పోరాటాల ఫలితంగానే ములుగు జిల్లా ఏర్పాటైందని సీతక్క గుర్తు చేశారు. నేడు అదే ములుగు జిల్లాను వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసే బాధ్యతను ముఖ్యమంత్రి తీసుకున్నారని తెలిపారు. గత ప్రభుత్వం కేవలం శంకుస్థాపనలు, జీవోలకే పరిమితమైందని విమర్శించిన ఆమె.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను ఆచరణలోకి తీసుకువస్తోందన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, రహదారుల అభివృద్ధి, గృహ నిర్మాణం వంటి కార్యక్రమాలను వేగంగా చేపడుతున్నామని చెప్పారు. ములుగు నియోజకవర్గంలో 5 వేల ఇళ్లను మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రి సీతక్క ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**మేడారం అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత**

సమ్మక్క – సారలమ్మ జాతర ప్రాశస్త్యాన్ని, ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ మేడారం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని సీతక్క అన్నారు. గత పాలకులు చేయని విధంగా మేడారం ఆలయ అభివృద్ధికి వందల కోట్ల రూపాయలతో పనులు చేపట్టామని తెలిపారు. మేడారం జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ములుగు జిల్లా అభివృద్ధి, మేడారం అభివృద్ధి, మహిళా సంక్షేమం, రహదారులు, సాగునీరు, విద్య, గృహ నిర్మాణం తదితర రంగాల్లో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు సీఎం పర్యటన మరింత ఊతమిచ్చిందని సీతక్క పేర్కొన్నారు.

**"తెలంగాణ ఆడబిడ్డ సీతక్క" అంటూ సీఎం ప్రశంసలు**

ములుగు కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రి సీతక్కపై ప్రశంసల జల్లు కురిపించారు. "తెలంగాణ ఆడబిడ్డ సీతక్క" అంటూ ఆమెను అభినందించిన ముఖ్యమంత్రి.. ములుగు జిల్లా అభివృద్ధి కోసం మంత్రి చేస్తున్న కృషిని తన ప్రసంగంలో పలుమార్లు ప్రస్తావించారు. ములుగు అభివృద్ధిపై మంత్రి సీతక్క చూపుతున్న చొరవను సీఎం అభినందించారు. జిల్లా అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**సహకరించిన ప్రతి ఒక్కరికీ సీతక్క కృతజ్ఞతలు**

ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, ములుగు జిల్లా ప్రజలకు మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు. ములుగు అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్తామని ఆమె స్పష్టం చేశారు.

# గంజాయి ముఠాతో ఖాకీల లింకులు..?

### డెడ్‌డ్రాప్ గంజాయి కేసులో సంచలన విషయాలు

### బొల్లా సోదరుల నెట్‌వర్క్‌పై ఈగల్ ఫోర్స్ దర్యాప్తు ముమ్మరం

**హైదరాబాద్, ఆగస్టు 16 (వార్త సంధ్య) :** హైదరాబాద్‌లో వెలుగుచూసిన డెడ్‌డ్రాప్ గంజాయి వ్యవహారంలో దర్యాప్తు కొనసాగుతున్న కొద్దీ సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. బొల్లా సోదరులు గంజాయి సరఫరా నెట్‌వర్క్‌ను నిర్వహించినట్లు ఈగల్ ఫోర్స్ దర్యాప్తులో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలపై పూర్తి నిర్ధారణ దర్యాప్తు పూర్తయిన తర్వాతే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**క్యాటరింగ్ సిబ్బంది పేరుతో నెట్‌వర్క్?**

దర్యాప్తు అధికారుల ప్రకారం.. బొల్లా సోదరులు క్యాటరింగ్ సిబ్బంది సరఫరాదారులుగా వ్యవహరిస్తున్నట్లు బయటకు కనిపించినప్పటికీ, వారి కార్యకలాపాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఓ చోరీ కేసులో పోలీసులకు సమాచారం అందించడంతో కొంతమంది పోలీసు సిబ్బందితో పరిచయాలు ఏర్పడ్డాయని దర్యాప్తు వర్గాలు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ పరిచయాల నేపథ్యంలో కొందరు పోలీసు సిబ్బందితో ఉన్న సంబంధాలపై కూడా అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.

**రోజుకు 25 డెలివరీలు?**

డెడ్‌డ్రాప్ పద్ధతిలో రోజుకు సుమారు 25 వరకు గంజాయి డెలివరీలు జరిగి ఉండవచ్చని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నట్లు నివేదిక పేర్కొంది. కస్టమర్లకు గంజాయి అందించేందుకు నంబర్ ప్లేట్లు లేని మూడు ద్విచక్ర వాహనాలను ఉపయోగించినట్లు అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

**పోలీసులపై కూడా విచారణ**

బొల్లా సోదరుల ఇంటిపై దాడి సమయంలో కొంతమంది పోలీసు కానిస్టేబుళ్లు అక్కడ ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం. వారిని అధికారులు మందలించి అక్కడి నుంచి పంపించినట్లు నివేదిక పేర్కొంది. మరోవైపు ఓ ఎస్ఐకి చెందిన వైర్‌లెస్ కమ్యూనికేషన్ పరికరం వారి కారులో ఉండిపోయిన ఘటనపైనా విచారణ జరుగుతోంది. సదరు ఎస్ఐ బొల్లా సోదరులతో కలిసి ఓ పార్టీలో పాల్గొన్నట్లు వచ్చిన ఆరోపణలపై సైబరాబాద్ పోలీసులు ఇప్పటికే ప్రశ్నించినట్లు సమాచారం.

**ఒడిశా నుంచి 30 మందికిపైగా?**

గంజాయి సరఫరా కోసం ఒడిశాకు చెందిన 30 మందికిపైగా వ్యక్తులను నెట్‌వర్క్‌లోకి తీసుకున్నట్లు ఈగల్ ఫోర్స్ దర్యాప్తులో తేలినట్లు నివేదిక పేర్కొంది. ఈ వ్యక్తుల పాత్ర, సరఫరా మార్గాలు, నగరంలో గంజాయి పంపిణీకి సంబంధించిన ఇతర లింకులపై అధికారులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

**కోర్టును ఆశ్రయించిన బొల్లా సోదరులు**

సుమారు రెండు నెలల క్రితం బొల్లా సోదరుల్లో ఒకరిని అధికారులు అదుపులోకి తీసుకుని అతని మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అనంతరం పోలీసుల తదుపరి చర్యలను అడ్డుకోవాలని



కోరుతూ బొల్లా సోదరులు కోర్టును ఆశ్రయించినట్లు నివేదిక పేర్కొంది. మొబైల్ ఫోన్, కాల్ డేటా, ఇతర ఆధారాల ఆధారంగా నెట్‌వర్క్‌లోని మరిన్ని వ్యక్తుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.

**పూర్తి నెట్‌వర్క్‌పై నజర్ :** డెడ్‌డ్రాప్ విధానంలో మాదకద్రవ్యాలను వినియోగదారులకు చేరవేసే విధానం, సరఫరాదారులు—వినియోగదారుల మధ్య సంబంధాలు, ఆర్థిక లావాదేవీలు, వాహనాల వినియోగం వంటి అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. పోలీసు సిబ్బందితో సంబంధాలపై వచ్చిన ఆరోపణలు కూడా దర్యాప్తులో కీలక అంశంగా మారాయి. అయితే ఆరోపణలకు సంబంధించిన పూర్తి వాస్తవాలు అధికారిక దర్యాప్తు అనంతరం వెల్లడికావాల్సి ఉంది.

# పెట్రోల్, డీజిల్ ఆటోలకు ఇక ఎలక్ట్రిక్ మార్పిడి

**తెలంగాణ ఆటో రిక్షా ఎలక్ట్రిక్ మార్పిడి పథకం–2026**

**CURE ప్రాంతంలోని 18,766 ఆటోలకు ప్రయోజనం**

**రెట్రోఫిట్మెంట్ లేదా కొత్త ఎలక్ట్రిక్ ఆటో కొనుగోలుకు రూ. 1. 50 లక్షల వరకు సాయం పథకానికి రూ. 200 కోట్ల బడ్జెట్**

**కాలుష్య నియంత్రణతో పాటు డ్రైవర్ల ఇంధన వ్యయాన్ని తగ్గించడమే లక్ష్యం: మంత్రి**



**క్రియాశీలంగా ఉన్న 18,766 ICE ఆటో రిక్షాలు పథకం పరిధిలోకి వస్తాయని మంత్రి తెలిపారు.**

**హైదరాబాద్, ఆగస్టు 16 (వార్త సంధ్య):** హైదరాబాద్‌ను స్వచ్ఛమైన, సుస్థిరమైన, పర్యావరణహిత ప్రజా రవాణా నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్‌తో నడిచే ఆటో రిక్షాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు "తెలంగాణ ఆటో రిక్షా ఎలక్ట్రిక్ మార్పిడి పథకం – 2026" ను రూపొందిస్తున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్–2047కు అనుగుణంగా రూపొందిస్తున్న ఈ పథకానికి రాష్ట్ర కేబినెట్ ఇటీవల ఆమోదం తెలిపిందని మంత్రి వెల్లడించారు. తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (CURE) పరిధిలో ప్రస్తుతం పెట్రోల్, డీజిల్‌తో నడుస్తున్న ఆటోలను దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

18,766 ఆటోలు పథకం పరిధిలోకి

**రవాణా శాఖ అధికారిక డేటాబేస్ ప్రకారం CURE ప్రాంతంలో చెల్లుబాటు అయ్యే రిజిస్ట్రేషన్‌తో**

**డీజిల్ ఆటోలు: 11,254**
**పెట్రోల్ ఆటోలు: 7,512**
**మొత్తం: 18,766**

అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడు తన అవసరానికి అనుగుణంగా రెండు మార్గాల్లో ఏదో ఒకదాన్ని ఎంచుకునే అవకాశం ఉంటుందని మంత్రి వివరించారు.

ప్రస్తుత ఆటోకు ఎలక్ట్రిక్ రెట్రోఫిట్మెంట్

ప్రస్తుత ఆటో ఛాసిస్‌ను కొనసాగించాలనుకునే యజమానులు AIS – 123 ఆమోదించిన ఎలక్ట్రిక్ కిట్ ద్వారా తమ వాహనాన్ని ఎలక్ట్రిక్‌గా మార్చుకోవచ్చు. కిట్ ఖర్చు, ఇన్‌స్టాలేషన్, ప్రామాణిక ఫిట్మెంట్ ఉపకరణాల ఖర్చుతో కలిపి రూ.1.50 లక్షల వరకు లేదా వాస్తవ వ్యయం ఈ రెండింటిలో ఏది తక్కువైతే ఆ మొత్తాన్ని ప్రభుత్వం ఆర్థిక సహాయంగా అందించనుంది. ఎంపానెల్ చేసిన విక్రేతల ద్వారా ఫిక్స్‌డ్ బ్యాటరీ కిట్ లేదా అవసరమైనప్పుడు తొలగించి తిరిగి అమర్చుకునే స్వాపబుల్ బ్యాటరీ కిట్‌ను ఎంచుకునే అవకాశం లబ్ధిదారులకు కల్పించనున్నారు.

**కొత్త ఎలక్ట్రిక్ ఆటో కొనుగోలుకు రూ. 1. 50 లక్షల సబ్సిడీ**

పాత పెట్రోల్ లేదా డీజిల్ ఆటోను పూర్తిగా అప్పగించి కొత్త ఎలక్ట్రిక్ ఆటో కొనుగోలు చేయాలనుకునే వారికి కూడా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించనుంది. ఫ్యాక్టరీలో తయారైన, టైప్ అప్రూవ్డ్ ఎలక్ట్రిక్ ప్యాసింజర్ త్రీ వీలర్ (L5M) కొనుగోలుకు రూ.1.50 లక్షల స్థిర సబ్సిడీ అందించనున్నారు. ఎంపానెల్ చేసిన డీలర్ వాహనం తుది ఆన్‌రోడ్ ధర నుంచి సబ్సిడీ మొత్తాన్ని ముందుగానే తగ్గించి లబ్ధిదారుడికి వాహనాన్ని అందించే విధంగా పథకాన్ని అమలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

రూ.200 కోట్లతో పథకం

ఈ పథకం అమలుకు ప్రభుత్వం రూ.200 కోట్ల బడ్జెట్ కేటాయింపును ప్రతిపాదించింది. CURE ప్రాంతంలోని అర్హత కలిగిన వాహన యజమానులకు సామాజిక వర్గంతో సంబంధం లేకుండా సమానంగా ప్రయోజనం కల్పించేందుకు వివిధ సంక్షేమ శాఖల నుంచి నిధులు సమకూర్చే విధంగా ప్రతిపాదన రూపొందించారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల నుంచి రూ.50 కోట్ల చొప్పున మొత్తం రూ.200 కోట్లు సమకూర్చే విధంగా ప్రభుత్వం ప్రతిపాదించింది.

**మూడంచెల పర్యవేక్షణ వ్యవస్థ**

పథకం పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేసేందుకు మూడు స్థాయిల్లో సంస్థాగత యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది.

**రాష్ట్రస్థాయి స్టీరింగ్ కమిటీ (SLSC):**

రోడ్లు—భవనాలు, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అధ్యక్షతన ఈ కమిటీ పనిచేస్తుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల కార్యదర్శులు సభ్యులుగా, రవాణా శాఖ కమిషనర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

**పథకం అమలు కమిటీ (SIC):**

రవాణా శాఖ కమిషనర్ అధ్యక్షతన జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు, CURE ప్రాంతంలోని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు, నామినేట్ చేసిన సంక్షేమ అధికారులు సభ్యులుగా ఉంటారు.

**జిల్లా మంజూరు కమిటీ (DSC):**

సంబంధిత జిల్లాల కలెక్టర్లు అధ్యక్షతన ఈ కమిటీ పనిచేస్తుంది. జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, జిల్లా రవాణా అధికారి, ఆర్టీవోలు, జిల్లా సంక్షేమ అధికారులు సభ్యులుగా ఉంటారు. డీటీవో కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

**డ్రైవర్లకు ఆర్థిక భారం తగ్గింపు**

CURE ప్రాంతంలో ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా హైదరాబాద్ నగరంలో పెట్రోల్, డీజిల్ ఆటోలను పెద్ద ఎత్తున ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చేందుకు వీలవుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఎలక్ట్రిక్ ఆటోల వినియోగంతో వాయు, శబ్ద కాలుష్యం తగ్గడంతో పాటు పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరల భారాన్ని ఆటో డ్రైవర్లు, యజమానులు కొంత మేరకు తగ్గించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. "తెలంగాణ రైజింగ్ విజన్ 2047కు అనుగుణంగా పర్యావరణ పరిరక్షణ, సుస్థిర పట్టణ అభివృద్ధి, ఆటో డ్రైవర్ల ఆర్థిక ప్రయోజనాలను సమన్వయం చేస్తూ ఈ పథకాన్ని రూపొందిస్తున్నాం. హైదరాబాద్‌ను స్వచ్ఛమైన గాలి, సుస్థిర ప్రజా రవాణా దిశగా తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యం" అని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# రేషన్ కార్డులపై రేవంత్, ఉత్తమ్‌ల ఫోటోల కోసం రూ. 100 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం: దాసోజు శ్రవణ్



**ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగుల బకాయిలకు నిధుల్లేవు.. ప్రచారానికి రూ. 100 కోట్లు ఖర్చు చేస్తారా?**

**సుప్రీంకోర్టు నిబంధనలకు విరుద్ధంగా మంత్రి ఫోటో ముద్రించారని ఆరోపణ**

**రేషన్ కార్డులపై సీఎం, మంత్రి ఫోటోలు తొలగించి అధికారిక కార్డులు ఇవ్వాలి**

**రూ. 100 కోట్ల ఖర్చుపై కాగ్‌తో సమగ్ర ఆడిట్ చేయాలి: బీఆర్ఎస్ డిమాండ్**

**హైదరాబాద్, ఆగస్టు 16 (వార్త సంధ్య):** పేద ప్రజలకు అందాల్సిన రేషన్ కార్డులను రాజకీయ ప్రచార సాధనాలుగా మార్చి ప్రజాధనాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ తీవ్రంగా విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోటోలతో కొత్త లామినేటెడ్ రేషన్ కార్డుల ముద్రణ కోసం సుమారు రూ.100 కోట్ల ప్రజాధనం ఖర్చు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆగస్టు 15న సంగారెడ్డితో పాటు రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ప్రారంభించిన 1.05 కోట్ల లామినేటెడ్ రేషన్ కార్డుల పంపిణీ నేపథ్యంలో దాసోజు శ్రవణ్ ఈ విమర్శలు చేశారు.

**"మింగ మెతుకు లేదు.. మీసాలకు సంపెంగ నూనె!"**

రాష్ట్రంలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించేందుకు నిధులు లేవని, ఉద్యోగుల పెన్షన్లు, గ్రాట్యుటీ వంటి బకాయిల విషయంలో ప్రభుత్వం ఇబ్బందులు ఎదుర్కొంటోందని చెబుతున్న సమయంలో రేషన్ కార్డులపై రాజకీయ నాయకుల ఫోటోల కోసం వందల కోట్లు ఖర్చు చేయడం ఏమిటని దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు. "మింగ మెతుకు లేదు కానీ మీసాలకు సంపెంగ నూనెలా తయారైంది కాంగ్రెస్ దరాసత్" అంటూ ఆయన ఘాటుగా విమర్శించారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న ఈ-రేషన్ కార్డులను రద్దు చేసి కొత్తగా లామినేటెడ్ కార్డులు ముద్రించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. క్లౌడ్ సర్వర్లు, ప్రత్యేక వెబ్‌సైట్లు, ప్రింటింగ్, లామినేషన్, 33 జిల్లాలకు కార్డుల రవాణా తదితర ఖర్చులతో ఒక్కో కార్డుకు సుమారు రూ.100 వరకు వ్యయం అవుతోందని ఆయన ఆరోపించారు.

నాడు మోదీ ఫోటోపై విమర్శలు.. నేడు రేవంత్ ఫోటోలు ఎందుకు?

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రధాని నరేంద్ర మోదీ ఫోటోలను ముద్రించినప్పుడు కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా విమర్శలు చేశారని దాసోజు శ్రవణ్ గుర్తుచేశారు. అప్పుడు ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వ్యక్తిగత ప్రచారానికి ఉపయోగించకూడదని కాంగ్రెస్ నేతలు చెప్పారని, ఇప్పుడు అదే విధానాన్ని తెలంగాణలో ఎందుకు అనుసరిస్తున్నారని ప్రశ్నించారు. "నాడు మోదీ ఫోటోలపై నీతులు చెప్పిన కాంగ్రెస్.. నేడు గల్లీలో చేస్తున్నది నగ్న ద్వంద్వ నీతి కాదా?" అని ఆయన నిలదీశారు. రేషన్ కార్డు ప్రజల హక్కు అని, అది ముఖ్యమంత్రి లేదా మంత్రి వ్యక్తిగతంగా తమ సొంత డబ్బుతో అందిస్తున్న సహాయం కాదని పేర్కొన్నారు.

**కేసీఆర్ ఫోటోలు వద్దన్నారని వ్యాఖ్య**

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అధికారులు రేషన్ కార్డులు, పట్టా పుస్తకాలపై అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఫోటో పెట్టాలని సూచించినప్పటికీ, ప్రజాధనంతో తన ఫోటోలు ప్రచారం చేయడం అవసరం లేదని కేసీఆర్ తిరస్కరించారని దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు.

ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ప్రజల డబ్బుతోనే ముఖ్యమంత్రి, మంత్రి ఫోటోలతో కార్డులు ముద్రించి ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు.

సుప్రీంకోర్టు తీర్పును ప్రభుత్వం పాటించాలి

రేషన్ కార్డులపై మంత్రి ఫోటో ముద్రించడం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధమని దాసోజు శ్రవణ్ ఆరోపించారు.

2016లో State of Karnataka vs Common Cause కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ, ప్రభుత్వ ప్రకటనల్లో సిట్టింగ్ ముఖ్యమంత్రి ఫోటోకు మాత్రమే పరిమిత మినహాయింపు ఉందని, కేబినెట్ మంత్రుల ఫోటోలకు అనుమతి లేదని ఆయన పేర్కొన్నారు. ఈ నిబంధనలను పక్కనపెట్టి పౌరసరఫరాల శాఖ మంత్రి ఫోటోను రేషన్ కార్డులపై ముద్రించడం రాజ్యాంగ విరుద్ధమని ఆరోపించారు.

**ఎన్నికల కోడ్ వస్తే మళ్లీ ప్రజాధనం ఖర్చు చేస్తారా?**

త్వరలో స్థానిక సంస్థలు లేదా జీహెచ్ఎంసీ ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తే ఈ కార్డులపై ఉన్న రాజకీయ నాయకుల ఫోటోల విషయంలో ప్రభుత్వం ఏం చేస్తుందని దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు. ఎన్నికల నిబంధనల కారణంగా ఫోటోలు తొలగించాల్సి వస్తే, ఇప్పటికే ముద్రించిన 1.05 కోట్ల కార్డుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. "మళ్లీ రీ-ప్రింటింగ్ పేరుతో మరో రూ.100 కోట్లు ప్రజాధనాన్ని ఖర్చు చేస్తారా?" అని ప్రభుత్వాన్ని నిలదీశారు.

**బీఆర్ఎస్ ప్రధాన డిమాండ్లు**

దాసోజు శ్రవణ్ నేతృత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ముందు పలు డిమాండ్లను ఉంచింది:

రేషన్ కార్డులపై ఉన్న ముఖ్యమంత్రి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఫోటోలను వెంటనే తొలగించాలి. అధికారిక రాజముద్రతో కూడిన సాధికారిక రేషన్ కార్డులను ప్రజలకు అందించాలి. కొత్త కార్డుల కోసం ఖర్చు చేస్తున్న సుమారు రూ.100 కోట్లపై కాగ్ (CAG)తో సమగ్ర ఆడిట్ నిర్వహించాలి. ప్రజాధనం దుర్వినియోగానికి బాధ్యులైన వారి నుంచి నిధులను రికవరీ చేయాలి. సుప్రీంకోర్టు నిబంధనలకు విరుద్ధంగా మంత్రి ఫోటో ముద్రించిన వ్యవహారంపై న్యాయపరమైన, రాజ్యాంగపరమైన చర్యలు తీసుకోవాలి. ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తే 1.05 కోట్ల రేషన్ కార్డుల పరిస్థితి ఏమిటో ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలి.

"ప్రజల సొమ్మును ప్రజా సంక్షేమానికే ఖర్చు చేయాలి"

పేద ప్రజల ఆహార భద్రతకు సంబంధించిన రేషన్ కార్డులపై పాలకుల ఫోటోలు ముద్రించి ప్రచారం చేసుకోవడం సంక్షేమం కాదని దాసోజు శ్రవణ్ అన్నారు.పేదల కోసం ఖర్చు చేయాల్సిన ప్రజాధనాన్ని వ్యక్తిగత రాజకీయ ప్రచారానికి వినియోగించడం ప్రజలను అవమానించడమేనని విమర్శించారు. ఫోటో కార్డుల పేరుతో జరుగుతున్న దుబారాను తక్షణమే నిలిపివేసి, ప్రజల సొమ్మును విద్య, వైద్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగుల బకాయిలు, పేదల సంక్షేమానికి వినియోగించాలని ఆయన డిమాండ్ చేశారు.

# శ్రీలంకపై భారత్ పట్టు.. పడిక్కల్ అద్భుత శతకం

**గాలే ఆగస్టు 16 (వార్త సంధ్య):** శ్రీలంకతో గాలే వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో భారత జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 460 పరుగులకు 9 వికెట్లు కోల్పోయి పటిష్ఠ స్థితిలో నిలిచింది. వర్షం కారణంగా రెండో రోజు ఆటకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉదయం సెషన్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోగా, మొత్తం 43 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది.

భారత బ్యాటర్ దేవదత్ పడిక్కల్ అద్భుతమైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. 230 బంతులు ఎదుర్కొన్న పడిక్కల్ 15 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 167 పరుగులు చేశాడు. ఇది అతడి టెస్టు కెరీర్‌లో తొలి శతకం కావడం విశేషం. అతడి ఇన్నింగ్స్ భారత స్కోరును భారీ స్థాయికి తీసుకెళ్లడంలో కీలకంగా మారింది.

కేఎల్ రాహుల్ 82 పరుగులతో రాణించగా, వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ 51 పరుగులు చేసి విలువైన సహకారం అందించాడు. రిషభ్ పంత్ 39 పరుగులు చేశాడు. మరోవైపు శ్రీలంక స్పిన్నర్లు భారత బ్యాటర్లను ఇబ్బందులకు గురిచేస్తూ పుంజుకున్నారు. ప్రబాత్ జయసూర్య 4 వికెట్లు, కేశర నువాన్‌థా 3 వికెట్లు పడగొట్టారు.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.